ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 37.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 8 మే 2025



కల్పవృక్ష, హనుమద్వాహనంపై

చెన్నకేశవుడు

ధర్మవరం, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. పట్టణ వీధులలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అర్చకులు కోనేరాచార్యులు, భానుప్రకాశ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం పల్లకీఉత్సవం, సాయంత్రం స్వామివారి కళ్యాణోత్సవం జరుగుతాయని ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.



కల్పవృక్షవాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవుడు, హనుమద్వాహనంపై స్వామి..

మహోజ్వల శక్తి అల్లూరి: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని ఎస్పీ రత్న కొనియాడారు. మన్యంవీరుడు అల్లూరి వర్థంతిని బుధవారం నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాయలయంలోని కాన్ఫరెన్సు హాల్లో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పరిమితమైన వనరులతో బ్రిటీషు వారిని గడగడలాడించిన యోధుడు అల్లూరి అన్నారు. మన్యం ప్రజల హక్కుల కోసం పోరాడి చిన్నవయస్సులోనే ప్రాణత్యాగం చేశారన్నారు. అల్లూరి త్యాగాలు భారతీయ యువత స్ఫూర్తి అన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఆర్ఐలు మహేష్, వలి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్పీ రత్న

పురానికి నిధుల వరద

అభివృద్ధి పనులకు రూ.92.50 కోట్లు మంజూరు

మారనున్న పట్టణ రూపురేఖలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణానికి మహర్దశ పట్టనుది. ఒకేసారి పట్టణాభివృద్ధికి రూ.92.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని, ముఖ్యమంత్రితో పలుసార్లు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆ మేరకు ఒకేసారి ఇంతమొత్తంలో నిధుల మంజూరుకు పరిపాలన అనుమతి ఇచ్చారు. 2019లో ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.66 కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో రోడ్ల చదును, కొన్నిచోట్ల సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభించారు. ప్రభుత్వం మారడంతో ఆ నిధులు విడుదల చేయకుండా ఆపేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో హిందూపురంలో రూ.10లక్షల రోడ్డు పనులు కూడా చేపట్టిన పాపాన పోలేదు. దీంతో శివారు ప్రాంతాల్లో నేటికీ మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. ఈ తరుణంలో ఎమ్మెల్యే బాలకృష్ణ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక నిధులు సాధించారు. ఈ నిధులతో సీసీరోడ్ల నిర్మాణం, డ్రైనేజీల ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్ సిస్టం మెరుగు పరచడం తదితర అభివృద్ధి పనులు చేపట్టనునున్నారు. నిధులు విడుదల చేయించడంపై ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు టీడీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. నిధుల విడుదలకు సంబంధించి బుధవారం జీఓ రావడంతో ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మున్సిపల్ ఛైర్మన్ రమేష్, నాయకులు కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ బాలాజీ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో 65వేల సూర్యఘర్ యూనిట్లు

కలెక్టర్ టీఎస్ చేతన్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మే7(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలో 65 వేల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో కలిసి జిల్లాలో పీఎం సూర్యఘర్ అమలు తీరుపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పీఎం సూర్యఘర్ పథకం గురించి ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. త్వరగా యూనిట్లు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, సోలార్ అధికారి వివేక్, డీపీఓ సమత, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో పటిష్ఠ భద్రత కల్పించాలి

కలెక్టర్ టీఎస్ చేతన్



ఎయిర్‌పోర్టులో బందోబస్తుపై ఎస్పీ, కలెక్టర్ మంతనాలు

పుట్టపర్తిరూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనకు ఈనెల 9న రానున్న నేపథ్యంలో సత్యసాయి విమానాశ్రయంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సీఎం రాక నేపథ్యంలో బుధవారం సత్యసాయి ఎయిర్‌పోర్టులో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ రత్నతో కలిసి ఆయన పరిశీలించారు. ఈనెల 9న విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో సీఎం చంద్రబాబు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుని, ఇక్కడి నుంచి అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం ఛాయాపురానికి వెళ్తారు. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, విమానాశ్రయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి కుంటల్లోకి పెట్టి అందిస్తున్నాం



మాకు రెండు బోర్లలో కలిసి ఒక ఇంచుదాకా నీరు వస్తుంది. ఆ నీటిని కుంటల్లో నింపుకుని ఆ తరువాత చీనీ చెట్లకు పెట్టుకుంటున్నాం. పూర్తి స్థాయిలో నీరు అందకపోవడంతో కొద్దిగా కొద్దిగా నీరందిస్తూ చెట్ల ప్రాణాలు కాపాడుకుంటున్నాం. ఇప్పుడు వస్తున్న నీరు ఎప్పుడు పోతోందో తెలియదు.

-బయన్న, రైతు, కునుకుంట్ల



అయ్యో..! పీబీసీ

పులివెందుల బ్రాంచ్ కెనాల్‌లో పారని నీరు

పలు గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్య

పండ్ల తోటలను కాపాడుకునేందుకు రైతుల అవస్థ

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

అమాత్యులైనా హామీని నెరవేర్చేరా..?

తాడిమర్రి, మే 7(ఆంధ్రజ్యోతి): దాదాపు మూడు దశాబ్దాలకు పైగా కరువు నేలపై సిరులు పండటానికి కారణమైన పీబీసీ (పులివెందుల బ్రాంచ్ కెనాల్) ప్రస్తుతం నిర్వీర్యమైపోతోంది. మండల సరిహద్దులో నిర్మించిన చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు హెచ్చెల్సీ ద్వారా తుంపెర డీప్‌కట్ నుంచి నీరు అందించేందుకు పీబీసీని అప్పట్లో ఏర్పాటుచేశారు. దీనికి అనుసంధానంగా రామాపురం వద్ద ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. దీని ద్వారా ముచ్చుకుంటపల్లి, రామాపురం గ్రామాలకు తాగునీరు అందించే ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం మూడు టీఎంసీలు నీరు ఈ కాలువ ద్వారా చిత్రావతి డ్యాంకు చేరేలా జీఓ కూడా ఇచ్చారు. కాలువ గుండా నీరు పారుతుండటంతో భూగర్భ జలాలు పెరిగి సమీప గ్రామాల రైతులు పంటలు బాగానే పండించుకున్నారు.

2017 నుంచి సమస్య ప్రారంభం

2004లో కాంగ్రెస్ ప్రభుత్వం పీబీసీని ఆధునికీకరించేందుకు రూ.100కోట్లతో పనులు ప్రారంభించింది. దాదాపు 90శాతం పనులు కూడా పూర్తి చేశారు. అయితే 2017 నుంచి ఈ కాలువకు నీటి కేటాయింపులు తగ్గుతూ వచ్చాయి. 2019లో వైసీపీ పాలనలో కాలువకు నీరు వదలడం పూర్తిగా మానేశారు. గండికోట రిజర్వాయర్ నుంచి మైలవరం, అక్కడి నుంచి గొడ్డుమర్రి, అక్కడి నుంచి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు మూడు లిఫ్ట్‌సిస్టంల ద్వారా నీరు తెచ్చి, ప్రతిఏటా 6 టీఎంసీలు నిల్వ ఉంచుతున్నారు. ఎగువ నుంచి కాకుండా దిగువ నుంచి నీళ్ల తెచ్చి సీబీఆర్‌ను నింపుతుండటంతో భవిష్యత్తులో పీబీసీ పరిస్థితి ఏమిటోనని రైతులు ఆందోళన చెందారు. అప్పటి ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కొంతవరకు నీటిని విడుదల చేయించారు. అయితే ఆ నీరు రామాపురం ఎత్తిపోతల పథకానికే సరిపోతోంది. కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి, నార్పల మండలం ముచ్చుకుంటపల్లి గ్రామాలకు తాగునీరు అందడం గగనం అయిపోయింది. కునుకుంట్ల గ్రామంలో 1.5లక్షలకు పైగా చీనీచెట్లు సాగులో ఉన్నాయి. రామాపురం, చిల్లకొండయ్యపల్లి గ్రామంలో చీనీ, అరటి తోటలు సాగులో ఉన్నాయి. ఈ గ్రామాలలో అరకొరగా వస్తున్న నీటిని పంట కుంటల్లో నిల్వ ఉంచుకుని పొలాలకు సరఫరా చేసు కుంటున్నారు. భూగర్భ జలాలు 600 అడుగుల లోతుకు పైగా పడిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కొత్తగా బోర్లు తవ్వించినా నీరు లభించడం లేదు. దీంతో కొందరు రైతులు తమ చీనీ చెట్లను బతికించుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తున్నారు. జిల్లాలోనే అత్యధిక పండ్ల తోటలు సాగు చేస్తున్న గ్రామంగా పేరుగాంచిన కునుకుంట్ల గ్రామం ప్రస్తుతం నీటి కోసం అల్లాడుతోంది. ఈ విపత్కర పరిస్థితిని హెచ్చెల్సీ అధికారులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం పండ్ల తోటలకు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించేందుకు అయ్యేఖర్చును ప్రభుత్వం అందించడంతో పాటు వచ్చే ఏడాది నుంచి పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు నీటి కేటాయింపులు పకడ్బందీగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.



పీబీసీ

మళ్లీ ఆ కాలం వస్తాదో.. రాదో..



పదేళ్ల కిందటి వరకు మా గ్రామంలో ఎక్కడ చూసిన నీరు ఉండేది. పంటలకు అవసరమయ్యే నీరు పుష్కలంగా లభించేది. ఇప్పుడు నీటి కోసం నానా యాతన పడుతున్నాం. అప్పట్లో నీరు బాగా లభించిన పాత బావులన్నీ ఇప్పటికే ఎండు ముఖం పట్టాయి. మే నెల పూర్తయ్యేలోపు ఎన్ని బావుల్లో నీరు ఇంకిపోతుందో..? మరెన్ని బోర్లు ఎండిపోతాయే తెలియడం లేదు.

- దామోదర్‌రెడ్డి, రైతు, కునుకుంట్ల

జీఓను అమలు చేయాలి



తుంపెర డీప్ కట్ వద్ద నుంచి సీబీఆర్‌కు పీబీసీ ద్వారా నీరందించేందుకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన జీఓను అమలు పరచాలి. ప్రతిఏటా మూడు టీఎంసీల నీరు ఈ కాలువ ద్వారా ప్రవహించి చిత్రావతికి చేరడం వల్ల ఎత్తిపోతల పథకానికి అయ్యే ఖర్చులు తగ్గుతాయి. రైతులకు నీరు కూడా బాగా లభిస్తుంది.

-రామ్మోహన్, రైతు, రామాపురం

హామీని మంత్రి నెరవేర్చేరా?

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ధర్మవరం నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ గత ఏడాది ఏప్రిల్ 16న కునుకుంట్ల గ్రామంలో పర్యటించారు. స్థానిక టీడీపీ మండల కన్వీనర్ కూచి రాము, కునుకుంట్ల నాయకులతో కలిసి ఎండుతున్న చీనీ తోటలను పరిశీలించారు. ఆ సందర్భంలో రైతులు పీబీసీ విషయం సత్యకుమార్ దృష్టికి తీసుకురాగా తమ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తప్పకుండా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నెరవేర్చాలని రైతులు కోరుతున్నారు.



ఎన్నికలకు ముందు చీనీ రైతులతో మాట్లాడుతున్న సత్యకుమార్ యాదవ్

రేపు కేంద్ర మాజీ హోంమంత్రి రాక

పుట్టపర్తిటౌన్, మే7(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ హోంమంత్రి శివరాజ్ పాటిల్ ఈనెల 9వ తేదీన పుట్టపర్తి రానున్నారు. ఈమేరకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం అధికారులను ఆదేశించారు. శుక్రవారం పుట్టపర్తి వచ్చి రెండు రోజులపాటు ఆయన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారన్నారు.

చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల తొలగింపు

కదిరి, మే 7(ఆంధ్రజ్యోతి): కదిరి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా, వైస్ చైర్‌పర్సన్ కొమ్ము గంగాదేవి, వైస్ చైర్మన్-2, ఆంజుగుంటి రాజశేఖర్‌రెడ్డిని పదవి నుంచి తొలగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆర్టీ నెంబర్ 405, 7-5-2025 మేరకు జీవో విడుదల చేశారు. ఆ మేరకు వీరు ముగ్గురిని తొలగించినట్లు ఉత్తర్వులో అధికారులు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ ముగ్గురిపై గత నెల 23న ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో ఈవిషయాన్ని ఎన్నికల అధికారులు ఆర్డీవో ద్వారా కలెక్టర్‌కు పంపారు. ఆయన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు తెలపడంతో బుధవారం ముగ్గురిని పదవి నుంచి తొలగిస్తూ జీవో జారీ చేశారు.

బడి బ్యాగు.. ఇక.. తేలికే..!

పిల్లలపై భారం తగ్గించేలా విద్యాశాఖ నిర్ణయం

(వివరాలు 6లో...)

రోడ్డు నాదే..!

వైసీపీ నాయకుడి దర్జా

రస్తా ఆక్రమించి ఇంటి నిర్మాణం

లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు

నోటీసులతో సరిపెడుతున్న అధికారులు

కదిరి, మే 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి 11 నెలలవుతున్నా వైసీపీ నాయకుల కబ్జాలకు ఫుల్‌స్టాప్ పడట్లేదు. కబ్జాల పరంపర కొనసాగిస్తున్నారు. వైసీపీకి చెందిన ఓ నాయకుడు పట్టణంలో ఏకంగా రోడ్డును ఆక్రమించి, ఇల్లు కడుతున్నాడు. అయినా మున్సిపల్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తన వార్డులో ప్రభుత్వ స్థలం ఆక్రమించుకుని ఇల్లు కడుతున్నారని సంబంధిత కౌన్సిలర్.. కౌన్సిల్ సమావేశంలో గొంతెత్తి చెప్పినా పట్టించుకునే నాథుడు లేడు. లక్షలు విలువచేసే స్థలం మాత్రం కబ్జా అయిపోయింది. అధికారులు నోటీసులతో సరిపెడుతున్నారు. కట్టడాలు ఆపకపోవడానికి లక్షలు చేతు లు మారడమే కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు.

రస్తా కలిపేసుకున్నాడు..

పట్టణంలోని వలిసాబ్ రోడ్డు, బైపాస్ రోడ్డు వెనుక వైపున మంగళి వెంకటప్ప వీధి ఉంది. ఇది దాదాపు 10 అడుగుల సందు. ఈ వీధి నుంచి బైపాస్ రోడ్డులోకి వెళ్లేవారు. ప్రస్తుతం ఈ దారిని ఆక్రమించేశారు. 24వ వార్డుకు చెందిన ఓ వైసీపీ నాయకుడు ఇటీవల బైపాస్ రోడ్డులో స్థలం కొన్నాడు. రెండు భాగాలుగా కొని, తన తల్లి పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఈ మొత్తం స్థలం 2,000 చదరపు అడుగులు ఉంటుంది. ఈ రెండు స్థలాలు కలిపి ఆ వైసీపీ నాయకుడు ఒకే ఇల్లుగా ప్లాన్ తీసుకున్నాడు. వెనుక ఉన్న రస్తా స్థలాన్ని కూడా కలుపుకుని కట్టేశాడు. ప్లాన్ మాత్రం రెండువేల అడుగులకే తీసుకున్నాడు. సెంటుపైగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించాడు. దీని విలువ ప్రస్తుతం రూ.50 లక్షల వరకు ఉంటుంది. ప్రజలకు దారి లేకుండా చేశాడు.

ప్లాన్ లేకుండానే నిర్మాణాలు

పట్టణ పరిధిలో ఎలాంటి నిర్మాణం చేపట్టాలన్నా మున్సిపాలిటీ అనుమతి తీసుకోవాలి. భవనాలకైతే ప్లాన్ ఉండాల్సిందే. 24వ వార్డుకు చెందిన ఓ వైసీపీ నాయకుడు ప్లాన్ ఒక రకంగా తీసుకుని, ఇంటి నిర్మాణం మరో రకంగా చేపడుతున్నాడు. రస్తా స్థలాన్ని కబ్జా చేసి మూడు అంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. ఆక్రమిత స్థలానికి ప్లాన్ కూడా లేదు. మున్సిపల్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ వ్యవహారంలో అధికారులు, కొంతమంది రాజకీయ నాయకులకు పెద్దఎత్తున ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ భవనం పక్కనే మరొకటి అనుమతులు లేకుండా కడుతున్నారు. అది కూడా సెంటులోపు స్థలంలో మూడు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. గతంలో ప్లాన్ తీసుకున్నా.. దాని గడువు తీరిపోయింది. రెన్యువల్ చేసుకోకుండానే భవనం కట్టాడు. వెనుక వైపు దాదాపు రస్తా స్థలాన్ని 20 అడుగులకుపైగా ఆక్రమించాడు. అయినా అధికారులు చోద్యం చూస్తున్నారు. అక్రమ కట్టడాలను ఆపకుండా వారితో లాలూచీ పడతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టిన భవనం

లక్షలు చేతులు మారాయి: అల్లాముస్తఫా, 24వ వార్డు కౌన్సిలర్




మా వార్డులో అక్రమ కట్టడాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణ యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. రెండేళ్లుగా చెబుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదు. లక్షల రూపాయల విలువ చేసే రస్తా స్థలాన్ని కబ్జా చేశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. చివరకు కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించినా అధికారులు పట్టించుకోలేదు. ఈ వ్యవహారంలో లక్షల రూపాయలు చేతులు మారాయి. అధికారులతోపాటు కొంతమంది నాయకులకు డబ్బులు ముట్టాయి. వెంటనే దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలి. అక్రమ నిర్మాణాలు ఆపాలి. లేదంటే ఆందోళన చేస్తాం.


పనులు ఆపడానికి చైన్‌మన్ లేడు: శివప్రసాద్, టీపీఓ, కదిరి

బైపాస్ రోడ్డులో అక్రమ నిర్మాణాలను ఆపడానికి చైన్‌మెన్ లేరు. ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. అక్రమ భవనాలు నిర్మిస్తే అధికంగా ఫైన్ వేస్తాం.



గోడౌన్‌లో కొత్తపుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు, మేనేజర్ పావని





1, 2 క్లాసులకు మూడు సబ్జెక్టులు ఒకే పుస్తకంగా కలిపి ముద్రించిన కొత్త బుక్



మారిన పదో తరగతి కొత్త సిలబస్ హిందీ పుస్తకం



9వ తరగతిలో సోషల్ అన్ని విభాగాలూ కలిపి ఒకే పుస్తకంగా..

బడి బ్యాగు..

ఇక.. తేలికే..!

పిల్లలపై భారం తగ్గించేలా విద్యాశాఖ నిర్ణయం

- కొన్ని సబ్జెక్టులు కలిపి ఒకే పుస్తకంలో ముద్రణ
- 1, 2 తరగతులకు ఒకే బుక్‌లో మూడు సబ్జెక్టులు
- మారిన 9, 10 క్లాసుల హిందీ సిలబస్
- ఉమ్మడి జిల్లాకు 15.91 లక్షల పాఠ్యపుస్తకాల ఇండెంట్
- జిల్లాకు చేరిన 14.86 లక్షల పుస్తకాలు
- మండల కేంద్రాలకు 9.44 లక్షలు సరఫరా
- స్కూళ్ల ప్రారంభానికి ముందే బుక్స్: డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, మే 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీపికబురు. బడి పిల్లలకు పుస్తకాల మొత తగ్గనుంది. బడి బ్యాగు తేలిక కానుంది. ఆ మేరకు కొత్త పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్. వస్తూ వస్తూ... కొత్త బుక్స్ న్యూలుక్‌తో ఎంట్రీ ఇస్తున్నాయి. బడి పిల్లలపై ఇక బ్యాగులు, పుస్తకాల బరువు ఉండబోదు. 'అయ్యో.. బుజ్జోడా.. ఇన్ని పుస్తకాలు ఎలా మోస్తాడబ్బా..' అంటూ తల్లిదండ్రుల మనసు చిబుకుమనేది. పేరెంట్స్ ఇకపై అలా చింతించాల్సిన పని ఉండదు. బడి పిల్లలపై పుస్తకాలు, బ్యాగుల బరువు తగ్గించాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు కొన్ని సబ్జెక్టులకు ఒకే పుస్తకాన్ని రూపొందించారు. గత పాలకులు ఒక పుస్తకాన్ని రెండు, మూడు సెమిస్టర్లుగా విభజించి, భారీగా ముద్రించి కోట్ల రూపాయలు దోచేశారు. కొత్త ప్రభుత్వం పిల్లలపై భారం ఉండరాదంటూ.. ఒకే పుస్తకంలో రెండు, మూడు సబ్జెక్టులు ముద్రించి, అదనపు భారాన్ని తగ్గించారు. 1 నుంచి పదో తరగతి వరకూ చూసినా... 6 సబ్జెక్టుల పుస్తకాల కంటే ఎక్కువ రావు. గతంలో 14 పుస్తకాలు ఇచ్చిన దాఖలాలున్నాయి. ఈ ఏడాది కొత్త పుస్తకాలు తక్కువ సైజ్‌తో.. ఎక్కువ సౌలభ్యంతో అందించనున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు 15.91 లక్షల పాఠ్యపుస్తకాల ఇండెంట్ పంపగా.. ఇప్పటికే 14.86 లక్షలు వచ్చాయి. 51 మండలాలకు 9.44 లక్షల పుస్తకాలను ఇప్పటికే సరఫరా చేశారు.



15.91 లక్షల ఇండెంట్...

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఉమ్మడిగా సెమిస్టర్-1 పుస్తకాలు 15.91 లక్షలు కావాలని ప్రింటర్లకు ఇండెంట్ పెట్టారు. జిల్లాలోని గోడౌన్లకు ఇప్పటికే 14.86 లక్షల పుస్తకాలను పంపారు. వాటిని ఆర్టీసీ బస్సుల ద్వారా మండలాలకు సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 63 మండలాలకుగాను 51 మండలాలకు 9.44 లక్షల పాఠ్యపుస్తకాలను ఇప్పటికే సరఫరా చేశారు. మండలాలకు చేరిన పుస్తకాలను స్కూళ్లకు మండల విద్యాశాఖాధికారులు సరఫరా చేయనున్నారు. మండల పాయింట్ నుంచి స్కూళ్లకు రవాణా చేసేందుకు అయ్యే వ్యయంపై అటు జిల్లా విద్యాశాఖ, ఇటు సమగ్రశిక్ష అధికారులు క్లారిటీ ఇవ్వడం లేదు.

బరువు తగ్గిన బడి పుస్తకం



ప్రభుత్వ బడిపిల్లల పాఠ్యపుస్తకాలు బరువు తగ్గాయి. ఇది అటు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభవార్త అనే చెప్పాలి. రెండు, మూడు సబ్జెక్టులను కలిపి ఒకే పుస్తకంలో ఉండేలా రూపొందించారు. గతంలో కొన్ని క్లాసులకు 10 నుంచి 14 పుస్తకాలను సైతం అందించారు. దీంతో విద్యార్థులు ఆ బరువు మోయలేక ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది వచ్చిన కొత్త పుస్తకాల్లో చాలా క్లాసులకు రెండు, మూడు సబ్జెక్టులను ఒక పుస్తకంగానూ, ఒక సబ్జెక్టుకు ఒక పుస్తకం తీసుకురావంతో ఆ బరువు తగ్గనుంది. ఈ ఏడాది వచ్చే కొత్త పుస్తకాల్లో 9, 10 తరగతుల హిందీ పుస్తకాలు సిలబస్ మారనున్నాయి. 1, 2 క్లాసులకు సంబంధించి తెలుగు, గణితం, ఇంగ్లిష్ (ఒక పుస్తకంగా), 3, 4, 5 తరగతులకు తెలుగు, ఇంగ్లిష్ (ఒక పుస్తకంగా), గణితం, ఈవీఎస్ (ఒక పుస్తకంగా), 6, 7 తరగతులకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ (ఒక పుస్తకంగా), సోషల్, గణితం, సైన్స్ (విడివిడిగా), 8వ క్లాస్‌కు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ (ఒకటిగా), ఫిజిక్స్, బయాలజీ (ఒకటిగా), సోషల్, గణితం (విడివిడిగా), 9వ క్లాస్‌కు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ (ఒకటిగా), ఫిజిక్స్, బయాలజీ(ఒకటిగా), గణితం, సోషల్ (విడివిడిగా), 10వ క్లాస్‌కు అన్ని సబ్జెక్టులు, వర్క్‌బుక్స్ కలిపి సుమారు 12 అందించనున్నారు.

51 మండలాలకు చేరాయి



కొత్త పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం వేగంగా సరఫరా చేస్తోంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు కలిపి 15.91 లక్షల పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా.. ఇప్పటి వరకూ 14.86 లక్షలు చేరాయి. 51 మండలాలకు సరఫరా ప్రారంభమైంది. 90 శాతం పుస్తకాలు జిల్లాకు చేరాయి. పాఠ్యపుస్తకాలతోపాటు ఇతర స్టూడెంట్ కిట్లు సైతం వస్తున్నాయి. స్కూళ్ల రీ ఓపెన్‌కు ముందే విద్యార్థులకు అన్నీ అందుబాటులో ఉంచుతాం.

- ప్రసాద్‌బాబు, డీఈఓ, అనంతపురం

విద్యుత్ బిల్లు చెల్లింపు

ఇక సులభతరం..!

క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు..

బిల్లులోనే క్యూఆర్ కోడ్‌ను రూపొందించిన విద్యుత్ సంస్థ



అనంతపురంరూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయింది. ఈ సాంకేతిక విధానాన్ని వినియోగించుకోవడంలో విద్యుత్ సంస్థ ముందు వరసలో ఉంటోంది. ఈ క్రమంలోనే వినియోగదారులకు విద్యుత్ సేవలను మరింత చేరువ చేసేలా చర్యలు చేపట్టింది. విద్యుత్ బిల్లుల చెల్లింపు ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ అడుగులు వేసింది. క్యూఆర్ కోడ్ ద్వారా బిల్లు చెల్లింపు ప్రక్రియను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. వినియోగదారులకు చెల్లించే బిల్లులోనే ఈ క్యూఆర్ కోడ్‌ను రూపొందించింది. ఈ నెల జారీ చేస్తున్న బిల్లుల నుంచి ఈ విధానాన్ని అమలులోకి తీసుకు వచ్చింది.

క్యూఆర్ కోడ్ ద్వారా..

కొన్నేళ్ల కిందట విద్యుత్ శాఖ సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చి బిల్లులు కట్టించుకునేవారు. ఆ తరువాత పెద్ద బుక్కులు తీసుకొచ్చి ఒక చోట కుర్చుని రాతపూర్వకంగా బిల్లులు కట్టించుకుని చిన్న పాటి స్లిప్‌లు వినియోగదారులకు ఇచ్చేవారు. అక్కడి నుంచి మిషన్ల ద్వారా బిల్లులు జారీకి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి కట్టించుకునేవారు. ఇంతలోనే చెల్లింపు కేంద్రాలకు వెళ్లకుండా ఫోన్‌పే, గూగుల్ పే, యూపీఐ తదితరాల ద్వారా చెల్లింపులు ప్రారంభించారు. కొన్ని రోజుల కిందట ఫోన్ పే, గూగుల్ పే ద్వారా చెల్లింపులు నిలిచిపోవడంతో ఆన్‌లైన్‌లోనే సంస్థ వెబ్‌సైట్‌లో బిల్లులు చెల్లింపులు ప్రారంభించింది. ఈ ప్రక్రియతో మొదట్లో వినియోగదారుల కొంత ఇబ్బంది పడ్డారు. ఈ విధానం ద్వారా చెల్లించలేనివారు కార్యాలయాలకు వచ్చి చెల్లిస్తున్నారు. తాజాగా క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపు ప్రక్రియను ప్రారంభించింది. ఈనెల జారీ చేస్తున్న విద్యుత్ బిల్లులో ఈ విధానాన్ని తీసుకొచ్చింది. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం ఇతరాత్రవాటి ద్వారా విద్యుత్ బిల్లుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే సంబంధిత వినియోగదారుడి బిల్లులు చూపిస్తుంది. తద్వారా వినియోగదారుడు బిల్లు చెల్లించుకునే వీలు కల్పించారు.

ఆ సర్వీసులకు తప్ప..

జిల్లాలో 10.19 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహ కనెక్షన్లు 7.07 లక్షలు, వ్యవసాయ కనెక్షన్లు 2.06 లక్షలు, వాణిజ్యం, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలు, వీధిదీపాలు ఇతరాత్ర కనెక్షన్లు లక్షకు పైగా ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ సర్వీసులకు సంబంధించి 25 వేల కనెక్షన్లు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఈ నూతన విధానం ప్రభుత్వ సర్వీసులకు లేదని తెలుస్తోంది. అదేవిధంగా అరియర్స్, బిల్లు పెండింగ్‌లో ఉన్న వినియోగదారులకు ఈ వెసులుబాటు ఉండదని అధికారులు చెబుతున్నారు. గత నెల బిల్లు చెల్లించకపోయినా ఈ నెల బిల్లులో ఈ క్యూఆర్ కోడ్ కనిపించదని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు.

సేవలను మరింత చేరువ చేసేందుకే..

విద్యుత్ సేవలను వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చాం. ప్రభుత్వ సర్వీసులకు మినహా..ప్రైవేట్ సర్వీసులన్నింటిలోను ప్రక్రియను అందుబాటులోకి తీసుకు వచ్చాం. కొన్ని రోజుల తరువాత వాటికి అమలు చేస్తాం. ఈ విధానం ద్వారా బిల్లులు ఏవిధంగా చెల్లించవచ్చో..వీడియోల ద్వారా ప్రచారం చేస్తున్నాం.

- శేషాద్రి శేఖర్, ఎస్‌ఈ, విద్యుత్ శాఖ

సొసైటీలకు జవసత్వాలు

జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) అరుణ



అనంతపురం క్లాక్‌టవర్, మే 7(ఆంధ్రజ్యోతి): సొసైటీలకు జవసత్వాలు ఇవ్వనున్నట్లు జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) అరుణకుమారి తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)లను అతి త్వరలో మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్చేందుకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయనీ, దీంతో వాటి స్వరూపమే మారిపోతుందన్న డీసీఓతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

ఇంటర్వ్యూ interview

ప్రశ్న: జిల్లాలో ఎన్ని ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘాలున్నాయి..?

డీసీఓ: జిల్లాలో 58 సొసైటీలున్నాయి. వీటి ద్వారా రైతులు, ప్రజలకు సేవలు అందిస్తున్నాం.

ప్రశ్న: సొసైటీల కంప్యూటరైజేషన్ ఏ మేరకు పూర్తయింది?

డీసీఓ: జిల్లాలో కంప్యూటరైజేషన్ విజయవంతంగా పూర్తిచేశాం. రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచాం. ఇక సొసైటీల్లో అన్ని లావాదేవీలు, ఆడిట్ కూడా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రశ్న: మల్టీపర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్చితే ఉపయోగాలేంటి?

డీసీఓ: సొసైటీలను బలోపేతం చేసి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు, రైతులకు ఇదివరకు పనిచేసిన మీ-సేవ కేంద్రాల తరహాలో అన్నిరకాల సేవలు అందించే అవకాశం ఉంటుంది. మొబైల్ రీచార్జితో మొదలుకుని విద్యుత్తు బిల్లులు, టిక్కెట్ బుకింగ్ ఇలా అనేక రకాల సేవలు సీఎస్‌సీల ద్వారా అందించవచ్చు. రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు అందించేందుకు సీడ్ సొసైటీ, సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించేందుకు ఆర్గానిక్ సొసైటీ, రైతులు పండించిన పంటలను ఎగుమతి చేసేందుకు ట్రాన్స్‌పోర్ట్ సొసైటీలతో సహకార సంఘాలను అనుసంధానం చేసి, గోడౌన్లను నిర్మించారు. పేదలకు తక్కువ ధరకే మందులు అందించేందుకు జన ఔషధి పేరుతో జనరిక్ మెడికల్ షాపులు ప్రారంభించనున్నారు. పెట్రోలు బంకులు సైతం ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్రాలు అందజేస్తారా..?

డీసీఓ: ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరికరాలు మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీల్లో అందుబాటులో ఉంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నామమాత్రపు అద్దెతో వాటిని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరం.

డ్రోన్‌సాయం..!

- చీనీకి సాంకేతిక దన్ను
- డ్రోన్ ద్వారా పంటల పర్యవేక్షణ

● చెట్ల ఎదుగుదల, తెగుళ్లపై రైతులకు సూచనలు ● పైలెట్ ప్రాజెక్టుగా ముకుందాపురం ఎంపిక ● ఇప్పటికే సర్వే పూర్తి



గార్లదిన్నె మండలం ముకుందాపురం వద్ద చీనీ తోటలో జీపీఎస్ ట్రాకింగ్‌ను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ డీడీ ఫిరోజ్ ఖాన్, హెచ్‌ఓ రత్నకుమార్

అనంతపురం అర్బన్/గార్లదిన్నె, మే 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సాంకేతికత వినియోగానికి నూతన ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. తద్వారా అన్నదాతకు అండగా నిలవాలని భావిస్తోంది. వ్యవసాయాన్ని డ్రోన్ సాయంగా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయి. జిల్లాలో విస్తారంగా సాగవుతున్న ఉద్యాన పంట చీనీ సాగులో సాంకేతికతను వినియోగించేలా చర్యలు చేపడుతోంది. సీజన్ల వారీగా పంటకు సోకే తెగుళ్లపై ముందస్తుగా రైతులకు సంక్షిప్త సమాచారం అందించేందుకు ప్రభుత్వం వినూత్న పద్ధతికి శ్రీకారం చుట్టింది.

పైలెట్ ప్రాజెక్టుగా ముకుందాపురం

జిల్లావ్యాప్తంగా 95వేల ఎకరాల్లో చీనీ సాగు చేస్తున్నారు. గార్లదిన్నె మండలంలోనే 22 వేల ఎకరాల్లో పంట సాగవుతోంది. మండలంలోని ముకుందాపురానికి చెందిన 1,711 మంది రైతులు 4,830 ఎకరాల్లో చీనీ పంట పెట్టారు. రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషన్ ఆదేశాల మేరకు అత్యధికంగా చీనీ పంట సాగులో ఉన్న ముకుందాపురం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. మూడు రోజులపాటు 34 బృందాలతో జియోకోఆర్డినేటర్ల ద్వారా సర్వే చేశారు. ఒక్కో బృందంలో వీహెచ్‌ఏ, ఎఫ్‌సీఓలు పనిచేశారు. గ్రామంలోని చీనీ తోటలను ఉద్యాన, ఏపీఎంఐపీ అధికారులు, సిబ్బంది జీపీఎస్ సర్వే చేశారు. ముకుందాపురం గ్రామంలోని 1,355 మంది రైతులకు సంబంధించి 4,247 ఎకరాల్లో జీపీఎస్ ట్రాకింగ్ చేసి, చీనీ తోటలకు సంబంధించి పాలిగాన్ మ్యాప్‌లు రూపొందించారు. ఆ మ్యాప్‌లను ఉద్యాన శాఖ కమిషనరేట్‌కు పంపించారు. హైదరాబాద్‌కు చెందిన 3 ఎఫ్ (ఫుడ్, ఫ్యాట్, ఫర్టిలైజర్) కంపెనీ సాంకేతిక సహకారంతో జీపీఎస్ ట్రాకింగ్ ఆధారంగా డ్రోన్ ద్వారా మూడురోజులపాటు ముకుందాపురం గ్రామంలోని చీనీ తోటలపై సర్వే చేశారు. పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే అన్ని రకాల ఉద్యాన పంటలకు డ్రోన్ సర్వే చేసి, రైతులకు మెరుగైన సేవలు అందించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యాన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పంటలో డ్రోన్ ద్వారా సర్వే చేస్తున్న దృశ్యం (ఫైల్)

డ్రోన్లతో పర్యవేక్షణ

చీనీ పంట తెగుళ్ల బారన పడుతుండడంతో చెట్లు దెబ్బతిని, దిగుబడులు తగ్గుతున్నాయి. తద్వారా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో సాంకేతికత సాయంతో పంట ఆరోగ్యాన్ని అంచనా వేయడంతోపాటు తెగుళ్లపై పర్యవేక్షణ చేపట్టనున్నారు. ఇన్‌ఫ్రారెడ్, మల్టీస్పెక్ట్రల్ కెమెరాలతో కూడిన డ్రోన్ సర్వే ద్వారా ఉద్యాన పంటల్లో పోషక లోపాలు, నీటి ఒత్తిడి, తెగుళ్ల బెడద తదితర సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తిస్తారు. దాని ఆధారంగా పంటకు సోకిన తెగుళ్లు, ఇతర దుష్ప్రభావాల నివారణకు ముందస్తుగానే రైతులకు సమాచారం ఇవ్వనున్నారు. కచ్చితమైన జీపీఎస్ మ్యాపింగ్ ద్వారా ఈ ప్రక్రియను చేపట్టినట్లు ఉద్యాన అధికారులు పేర్కొంటున్నారు. డ్రోన్ సర్వే ద్వారా నేలలో తేమ, మొక్కల ఆరోగ్యం, కలుపు మొక్కల వృద్ధిని క్షేత్ర పరిస్థితులకు సంబంధించి వివరణాత్మక చిత్రాలను రూపొందిస్తారు.



చీనీ తోటలో జీపీఎస్ ట్రాకింగ్‌పై శిక్షణ ఇస్తున్న అధికారులు

డ్రోన్ సర్వే ద్వారా చాలా ఉపయోగాలున్నాయి. ప్రాథమిక దశలోనే పంటలకు సోకే తెగుళ్లను గుర్తించడం ద్వారా అనవసరంగా పురుగు మందుల వాడకాన్ని తగ్గించవచ్చు.

ఉపయోగాలు..

పంటలకు సోకే తెగుళ్లతోపాటు నేలలో తేమ శాతాన్ని గుర్తిస్తుంది. తద్వారా నీటి వృథాను తగ్గించవచ్చు. డ్రోన్ల ద్వారా సేకరించిన డేటా ఆధారంగా పంటలకు నష్టం వాటిల్లినపుడు పంటల బీమా, పంటనష్ట పరిహారం అందించే అవకాశం ఉంటుంది. తెగుళ్ల నివారణకు పిచికారీ చేసుకోవాల్సిన పురుగుమందులతోపాటు ఏయే రకాల ఎరువులు వాడితే పంట ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్న సమగ్ర సమాచారాన్ని అందిస్తారు. పంట నిర్వహణకు రైతులకు సకాలంలో కచ్చితమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.



డ్రోన్ ద్వారా తీసిన ఫొటో

రైతులకు చాలా ఉపయోగం



రాష్ట్ర ఉద్యాన శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అత్యధికంగా చీనీ సాగవుతున్న ముకుందాపురం గ్రామాన్ని ఎంపిక చేశాం. గ్రామంలో చీనీ సాగు చేసే రైతులకు సంబంధించిన పొలాన్ని నాలుగు దిక్కులా జీపీఎస్ ద్వారా సర్వే చేసి, పాలిగాన్ మ్యాప్‌లు తయారు చేశాం. తోట ఎలా ఉంటే పాలిగాన్ మ్యాప్‌లు అలాగే ఉంటాయి. ఇందులో రైతు పేరు, సర్వే, ఖాతా నంబర్లతోపాటు ఎంత విస్తీర్ణంలో చీనీ సాగు చేశారన్న వివరాలు ఉంటాయి. పైలెట్ ప్రాజెక్టు కింద ప్రీ కౌంట్-ప్రీ హెల్త్ నినాదంతో హైదరాబాద్‌కు చెందిన 3 ఎఫ్ (ఫుడ్, ఫ్యాట్, ఫర్టిలైజర్) కంపెనీ సాంకేతిక సహకారంతో డ్రోన్ సర్వే పూర్తి చేశాం. తొలి విడతలో ముకుందాపురం గ్రామంలోని 1,355 మంది రైతులకు సంబంధించి 4,247 ఎకరాల్లో జీపీఎస్ ట్రాకింగ్ చేసి, తోటలకు సంబంధించిన పాలిగాన్ మ్యాప్‌లు రూపొందించాం. ఉద్యాన శాఖ కమిషనరేట్‌కు పంపించాం. ఆయా రైతుల చీనీ తోటలకు సంబంధించిన జీపీఎస్ కోఆర్డినేట్లను శాటిలైట్‌కు అనుసంధానం చేస్తారు. డ్రోన్ సర్వే ద్వారా చీనీ తోటలకు సోకిన పలు రకాల చీడపీడలు, తెగుళ్లపై ఆర్‌ఎన్‌డీ సంస్థ ద్వారా రైతుల సెల్‌ఫోన్‌కు సంక్షిప్త సమాచారంతో డ్రోన్ అలర్ట్ వెళ్తుంది. తద్వారా ఏయే రకాల తెగుళ్లు సోకాయి..? అందుకు ఏ మందులు పిచికారీ చేసుకోవాలన్న దానిపై రైతులకు అవగాహన కల్పించవచ్చు.

- ఫిరోజ్‌ఖాన్, ఉద్యాన శాఖ డీడీ

కొత్త రేషన్‌కార్డులకు ఓకే

మార్పుచేర్పులకు అవకాశం

గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ



జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయం

అనంతపురంటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొన్నేళ్లుగా అర్హత ఉండి రేషన్‌కార్డు కోసం అనేకమంది ఎదురుచూస్తున్నారు. రేషన్ కార్డుల్లో తప్పులను సవరించుకునేందుకు, అడ్రస్ మార్పు, కుటుంబసభ్యులను కార్డులో నమోదు చేయించుకునేందుకు వేలాదిమంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఈ ఆప్షన్లను గత వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక అర్హులందరికీ కొత్తరేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించింది. కొన్ని నెలలుగా అదిగో.. ఇదిగో.. అంటూ ప్రచారం సాగుతూ వచ్చింది. ఎట్టకేలకు కొత్తరేషన్ కార్డుల జారీకి సర్కారు సై అంది. ఆ మేరకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్‌గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

దరఖాస్తులు ప్రారంభం

కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల పక్రియ బుధవారం నుంచే మొదలు పెట్టారు. జిల్లాలో ఇప్పటివరకు అధికారిక లెక్కల మేరకు 6.60లక్షల రేషన్‌కార్డులున్నాయి. వీటిలోని లబ్ధిదారుల్లో చాలామంది చనిపోయారు. ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయినోళ్లు ఉన్నారు. వివాహమైన వారు, పేర్లు తప్పుగా నమోదైనోళ్లు ఉన్నారు. వీరందరూ కొత్తకార్డులతోపాటు మార్పుచేర్పులు చేసుకునేందుకు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎక్కడకు వెళ్లినా వినతులు ఇస్తున్నారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలోనూ అధికార యంత్రాంగానికి అర్జీలు సమర్పిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ వర్గాలు చెబుతున్న సమాచారం మేరకు 50వేలకుపైగా వినతులు ఉంటాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకపోవడంతో అవన్నీ కార్యాలయాలకే పరిమితమమయ్యాయి. ప్రస్తుతం సర్కారు సై అనడంతో వీరందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్త రేషన్ కార్డు, కుటుంబసభ్యుల విభజన, పాతకార్డులో పేర్ల నమోదు, చిరునామాల మార్పు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందజేయవచ్చు.

ఉత్తర్వులు వచ్చాయి

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించడానికి రాష్ట్ర కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. మార్పుచేర్పులకు అవకాశం కల్పించారు. ఈ పక్రియ బుధవారమే ప్రారంభమైంది. సోమవారం నుంచి వాట్సాప్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

-జగన్నాథరావు, ఇన్‌చార్జి డీఎస్‌ఓ

హెలీప్యాడ్ వద్ద ఏం జరిగింది?

● వైసీపీ నాయకులను విచారించిన పోలీసులు



విచారణకు హాజరైన వైసీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం జగన్ పర్యటన సందర్భంగా కుంటిమద్ది హెలీప్యాడ్ వద్ద మీరు ఉన్నారా? అక్కడ ఏం జరిగింది?' అంటూ రామగిరి సీఐ శ్రీధర్.. వైసీపీ నాయకులపై ప్రశ్నల వర్షం కురిపించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో బుధవారం 23 మంది వైసీపీ నేతలు ఒక్కొక్కరిని వేర్వేరుగా విచారించారు. అవసరమైతే మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని వారికి సీఐ తెలిపారు. విచారణకు హాజరైన వారిలో చెన్నేకొత్తపల్లి మండలం నుంచి ముగ్గురు, రాప్తాడు నుంచి ఒకరు, కనగానపల్లి నుంచి 19 మంది ఉన్నారు. వారిలో వైసీపీ రాప్తాడు మండల కన్వీనర్ సాకే వెంకటేశ్, కనగానపల్లి జడ్పీటీసీ మారుతీప్రసాద్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉన్నారు. ఇప్పటివరకు మొత్తం 41 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు.. పోలీసు విచారణకు హాజరయ్యారు.

ఎస్కేయూ బీఈడీలో 86 శాతం పాస్

అనంతపురం సెంట్రల్, మే 7(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఈడీ ద్వితీయ సెమిస్టర్ పరీక్షల్లో 86శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ మేరకు బుధవారం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అనిత తన కార్యాలయంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబుతో కలిసి బీఈడీ, ఎంబీఏ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. అనంతరం వీసీ అనిత మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో నిర్వహించిన బీఈడీ ద్వితీయ సెమిస్టర్ పరీక్షలకు 735 మంది విద్యార్థులకుగాను 639మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. దీంతో ఉత్తీర్ణత శాతం 86.94గా నమోదైందన్నారు. ఎంబీఏ జనరల్ కోర్సు పరీక్షల్లో 1,455 మందికిగాను 1,143 మంది, ఫైన్ ఆర్ట్స్ పరీక్షల్లో 56 మందికిగాను 51 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్‌లో ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్, ఏఆర్ శంకర్, సూపరింటెండెంట్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

డీఎస్సీ క్రాష్ కోర్సుపై ఉచిత శిక్షణ

అనంతపురం సెంట్రల్, మే 7(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థులకు డీఎస్సీ క్రాష్ కోర్సుపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బుధవారం విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు వినోద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెగా డీఎస్సీకి ఎస్‌జీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న దృష్టి, వినికిడి లోపం, ఆర్థోపెడిక్ మొదలగు విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థులు అర్హులన్నారు. విజయవాడలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణకు ఈనెల 11వరకు https://mdfc.apcfss.in/ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక బోధనాశిక్షణ, స్టడీ మెటీరియల్, భోజన, వసతి సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తారన్నారు.

వైస్ సర్పంచ్‌కు 14 రోజుల రిమాండ్

పెనుకొండ రూరల్ మే 7(ఆంధ్రజ్యోతి): స్థలం విషయంలో మునిమడుగు పంచాయతీ అమ్మవారిపల్లికి చెందిన వైస్ సర్పంచ్ వెంకటరెడ్డి తనను అసభ్యకరంగా దూషించి, దాడి చేశాడని ధరణి అనే మహిళ కియ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి, వైసీపీ వైస్ సర్పంచ్‌ను బుధవారం కోర్టులో హాజరుపర్చారు. ఈ నేపథ్యంలో పెనుకొండ మెజిస్ట్రేట్ వెంకటరెడ్డికి 14 రోజుల రిమాండ్ విధించారు.

కాలువ వెడల్పుతోనే ప్రయోజనం: ఎమ్మెల్సీ

విడపనకల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని అనంతపురం, చిత్తూరు, జిల్లాలకు సాగు, తాగు నీరు కావాలంటే హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి పేర్కొన్నారు. వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల గ్రామంలో గల తన గృహంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువను 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో తవ్వితే 2200 క్యూసెక్కులు మాత్రమే పారిస్తున్నారన్నారు. 10వేల క్యూసెక్కులు పారేలా పనులు చేపట్టాలన్నారు. అధికంగా వచ్చే నీటిని నిల్వ చేసుకునేందుకు జీడిపల్లి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 4 టీఎంసీలకు పెంచాలని కోరారు. ప్రభుత్వం.. రాయలసీమకు న్యాయం చేయాలంటే కాలువను వెడల్పు చేయడంతోపాటు జీడిపల్లి రిజార్వాయర్ నిలువ సామర్థ్యాన్ని పెంచాలని ఆయన అభిప్రాయపడ్డారు.

చెక్‌బౌన్స్ కేసులో టీచర్‌కు జైలుశిక్ష

హిందూపురం, మే 7(ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో ఉపాధ్యాయురాలికి మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ హిందూపురంలోని ప్రత్యేక కోర్టు న్యాయాధికారి రమణయ్య బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రస్తుతం లేపాక్షి మండలం మైదుగోళం ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సత్యవతి హిందూపురానికి చెందిన నేత్రావతి వద్ద రూ.3లక్షలు అప్పు తీసుకుంది. డబ్బు తిరిగి చెల్లించడానికి చెక్కు ఇచ్చింది. అది బ్యాంక్‌కు కలెక్షన్ కోసం వెళ్లగా బౌన్స్ అయింది. దీంతో బాధితురాలు నేత్రావతి కోర్టుకు వెళ్లింది. విచారించిన ప్రత్యేక కోర్టు న్యాయాధికారి ఉపాధ్యాయురాలు సత్యవతికి మూడునెలల జైలుశిక్ష, రూ.3లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు బాధితురాలు నేత్రావతి తరఫు న్యాయవాది సంపత్‌కుమార్ తెలిపారు.

15 మంది ఎంపీడీఓలకు పోస్టింగ్

అనంతపురం విద్య/న్యూటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు చెందిన 15 మంది ఎంపీడీఓలకు బుధవారం ప్లేస్ పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందించారు. గత నెల 25న రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఈఓఆర్డీలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లకు తాత్కాలిక ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. కొత్త ఎంపీడీఓలకు ప్లేస్‌లు కేటాయించారు.

పేరు	కేటాయించిన ప్లేసు
ధనుంజయ	కళ్యాణదుర్గం
విజయసింహారెడ్డి	బ్రహ్మసముద్రం
సూర్యనారాయణ	కంబదూరు
శివాజీరెడ్డి	వజ్రకరూరు
జిలానీబాషా	శెట్టూరు
రెడ్డెప్ప	పరిగి
పార్థసారథి	ఎన్పీకుంట
కరుణసాగర్	చిలమత్తూరు
బాలకృష్ణుడు	సీకేపల్లి
నాగేశ్వర్‌శాస్త్రి	రొళ్ల
వెంకటలక్ష్మమ్మ	సోమందేపల్లి
కేశవరెడ్డి	గుడిబండ
నసీమా	తలుపుల
మమతాదేవి	తనకల్లు
నటరాజ్	కొత్తచెరువు

ప్రాణాలు తీసిన సెలవులు

● పీబీసీలో మునిగి ఇద్దరు చిన్నారుల మృతి
● కాపాడే ప్రయత్నంలో నాన్నమ్మ కూడా..



లిదియా, జాషువా, నాగలక్ష్మమ్మ (ఫైల్)

తాడిపత్రి/యల్లనూరు, మే 7(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో నాన్నమ్మ వద్ద సంతోషంగా గడపాలని వెళ్లిన ఇద్దరు చిన్నారులు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయారు. వారిని కాపాడే ప్రయత్నంలో నాన్నమ్మ కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన యల్లనూరు మండలం కల్లూరులో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ(61), ఆమె మనవరాలు లిదియా(12), మనవడు జాషువా(10) పులివెందుల బ్రాంచ్ కెనాల్‌లో మునిగి మృతిచెందారు. కల్లూరుకు చెందిన శ్రీనివాసులు, శాంతమ్మ దంపతులు బతుకుదెరువు కోసం తాడిపత్రికి వచ్చారు. శ్రీనివాసులు ఇంటిపట్టునే ఉంటూ వారి పిల్లలు లిదియా, జాషువాను చూసుకునేవాడు. శాంతమ్మ శింగనమలలోని పశువైద్యశాలలో పనిచేస్తోంది. తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో లిదియా 5, జాషువా 3వ తరగతి చదువుతున్నారు. వేసవి సెలవులు రావడంతో తల్లిదండ్రులు కల్లూరులోని వారి నాన్నమ్మ నాగలక్ష్మమ్మ వద్దకు పిల్లలను పంపించారు. నాగలక్ష్మమ్మ దుస్తులు ఉతికేందుకు బుధవారం ఉదయం గ్రామ శివారులో ఉన్న పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) వద్దకు వెళ్లింది. ఆ తరువాత కాసేపటికి మనవడు, మనవరాలు నానమ్మ వద్దకు వెళ్లారు. అక్కడ ఉతికిన దుస్తులను బయటకు తీసుకువచ్చే సమయంలో జాషువా కాలుజారి కాలువలో పడిపోయాడు. తమ్ముణ్ని రక్షించేందుకు చేయి అందించిన లిదియా కూడా కాలువలో పడిపోయింది. ఇది చూసిన నాగలక్ష్మమ్మ వారిని కాపాడేందుకు కాలువలో దూకింది. ఆమెకు ఈత వచ్చినా, చిన్నారులిద్దరూ భయంతో ఆమెను పట్టుకోవడంతో ప్రవాహ వేగానికి ముగ్గురూ మునిగిపోయారు. అక్కడే దుస్తులు ఉతుకుతున్న గ్రామస్థులు వారిని రక్షించే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. ఒడ్డుకు చేర్చేలోగా ముగ్గురూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న చిన్నారుల తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలాన్ని తహసీల్దారు శేషారెడ్డి, ఎస్ఐ రామాంజనేయరెడ్డి, ఏఎస్ఐ సంపత్ తదితరులు పరిశీలించారు. ప్రమాదంపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలి

● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వినతి



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ

అనంతపురం మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ కింద విదేశాల నుంచి అందే సాయానికి సంబంధించి రెన్యువల్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ మేరకు బుధవారం ఎస్కేయూనివర్సిటీ పూర్వ విద్యార్థులు కృష్ణయ్య తదితరులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను ఆయన కార్యాలయంలో రామకృష్ణ కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీటీకి విదేశీ సాయం అందే విషయంపై చర్చించారు. 1969లో అనంతపురం జిల్లాలో ఆర్డీటీ సంస్థను విన్సెంట్ ఫెర్రర్, అన్నే ఫెర్రర్ దంపతులు స్థాపించారన్నారు. సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పేదరికం, బాధలు, అన్యాయాలను నిర్మూలించేందుకు, సమాన అవకాశాలు, సంపదను అందరికి పంచడానికి కృషి చేస్తున్నా రని తెలిపారు. వేలాదిగా బావులు తవ్వించడంతోపాటు లక్షలాది గృహాలను నిర్మించారన్నారు. కుష్టువ్యాధి నిర్మూలన కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. కూలీలను సైతం రైతులుగా మార్చడంలో ఆ సంస్థ కృషి ఎంతో ఉందన్నారు. విద్యా, వైద్యం, గృహ నిర్మాణం, స్థిరమైన జీవనోపాధి, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల ద్వారా పేదల అభ్యున్నతికి ఆ సంస్థ కృషి చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సదుపాయాలను కల్పించేందుకు మొబైల్ లైబ్రరీలు, ట్యూషన్లు ఏర్పాటు చేయడంతోపాటు స్కాలర్‌షిప్‌లు అందించిందన్నారు. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్లులో ఆస్పత్రులను ఏర్పాటు చేసి, రోజుకు 3వేల మందికిపైగా పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలే పరమావధిగా పేదల బతుకుల్లో వెలుగులు నింపుతున్న ఆర్డీటీకి విదేశీ సహకారం నియంత్రణ చట్టం లైసెన్స్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్రప్రభుత్వం తరపున కేంద్రాన్ని కోరాలని రామకృష్ణ సీఎస్‌కు విజ్ఞప్తి చేశారు.

వాతావరణానికి అనుగుణంగా సాగు

● ఆచార్య ఎన్జీరంగా వర్సిటీ సంచాలకులు

బుక్కరాయసముద్రం, మే7(ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల వేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని రేకలకుంటలోని ఆచార్య ఎన్జీరంగా మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రంలో బుధవారం అత్యల్ప వర్షపాత మండల పరిశోధన, విస్తరణ సలహామండలి సమావే శం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ, ప్రాంతీయ పరిశోధన సంచాలకులు జాన్సన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రానున్న ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులు సాగు చేసే పంటలు, వర్షపాతం నమోదు ఆధారంగా రైతులు ఏ పంటలు సాగుచేయాలో తదితర అంశాలపై చర్చించారు. డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ప్రాంతాల వారిగా రైతులు సాగుచేసే పంటలను తొలుత గుర్తించాలన్నారు. అనంతరం ఆయా ప్రాంతాలలో కురిసిన వర్షపాతం, వాతావరణం అనుగుణంగా పంటల సాగుపై పరిశోధనలు చేసి రైతులకు పంటల సాగుపై ప్రణాళికను ముందుస్తుగా తెలియజేయాలన్నారు. వర్షాకాలంలో ఎక్కువ వర్షం కురిసే ప్రాంతాల్లో నీటిని నిల్వ చేసే పంటలు, తక్కువ వర్షం కురిసే ప్రాంతాల్లో కరువును తట్టుకునే పంటలను రైతులు సాగు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణం అనుగుణంగా పంటలు వేయడం వలన పంట దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ మార్గాలను, నేల, నీటి సంరక్షణపై రైతులు అవగాహన చేసుకోవాల్సి అవశ్యకత ఉందన్నారు. రైతుల వ్యవసాయంలో సాంకేతిక అందిపుచ్చుకోవాల న్నారు. కార్యక్రమంలో మహానంది అగ్రికల్చర్ డీన్ విజయలక్ష్మి, రాయలసీమ జిల్లాల అగ్రికల్చర్ అధికారులు ఉమా మహేశ్వరమ్మ, సుబ్బారావు, మురళీకృష్ణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఫిరోజ్‌ఖాన్, వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

స్టేట్‌లో మన విద్యార్థుల సత్తా

● ఉమ్మడి జిల్లా విద్యార్థులకు రాష్ట్ర ర్యాంకులు
● ఉత్తమ మార్కులు వచ్చిన వారికి టాప్ 10లో చోటు
● టెన్త్, ఇంటర్ విద్యార్థుల ఎంపిక
● ఉమ్మడి జిల్లాలో 19 మంది..
● ఇద్దరు టీచర్లకు 'బెస్ట్' గుర్తింపు

అనంతపురం విద్య/కొత్తచెరువు, మే 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్టేట్ టాపర్ల జాబితాలో చోటు దక్కింది. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు టాప్ 10లో చోటు కల్పించారు. స్టేట్ ర్యాంకింగ్ అవార్డుల జాబితాలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలు వెల్ఫేర్ స్కూళ్లు, రెసిడెన్షియల్, గురుకులాల్లో చదివే విద్యార్థులు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా పలు మేనేజ్‌మెంట్ హాస్టళ్లు, స్కూళ్లలో చదివిన 19 మంది విద్యార్థులు స్టేట్ ర్యాంకర్లుగా, సిల్వర్ ర్యాంకర్లుగా ఎంపిక అయ్యారు. ఉత్తమ బోధన అందించి మంచి ఫలితాలు సాధించిన టీచర్లు, ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లను సైతం ఎంపిక చేశారు. అయితే టీచర్ల కేటగిరీలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ మేనేజ్‌మెంట్‌లో అనంతపురం జిల్లా కణేకల్లు జువాలజీ టీచర్ రమా నాయక్‌ను, ఉరవకొండ స్కూల్ ఎకనామిక్స్ టీచర్ సరస్వతిని మెరిటోరియస్ టీచర్లుగా గుర్తించారు. ఉత్తమ ర్యాంకులు పొందిన 19 మంది విద్యార్థుల వివరాలు ఇలా....

ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ మేనేజ్‌మెంట్‌లో...				
విద్యార్థి పేరు	మార్కులు	ర్యాంకు	స్కూల్	జిల్లా పేరు
1.పూజశ్రీ	587	4వ ర్యాంకు	హిందూపురం స్కూల్	శ్రీసత్యసాయి
2.వరుణ్ ఆదిత్యా	587	4వర్యాంకు	కాళసముద్రంస్కూల్	శ్రీసత్యసాయి
3.కావ్యశ్రీ	586	5వ ర్యాంకు	గుత్తిస్కూల్	అనంతపురం
4.తరుణ్ నాయక్	582	8వ ర్యాంకు	హిందూపురం బాయ్స్	శ్రీసత్యసాయి
5.భానుప్రసాద్	582	9వ ర్యాంకు	రొళ్ల	శ్రీసత్యసాయి
6. కీర్తన	581	10వర్యాంకు	హిందూపురం	శ్రీసత్యసాయి
7.పవిత్ర	581	10వ ర్యాంకు	హిందూపురం	శ్రీసత్యసాయి
8. మధులత	580	సిల్వర్ ర్యాంకర్	నల్లమాడ	శ్రీసత్యసాయి
ఇంటర్ కోర్సుల్లో....				
9.గ్రీష్మ	985(బైపీసీ)	2వర్యాంకు	కురుకుంట	అనంతపురం
10.సుచిత్ర	957(సీఈసీ)	2వర్యాంకు	కురుగుంట	అనంతపురం
11. రమణి	982(ఎంపీసీ)	సిల్వర్ ర్యాంకర్	కురుగుంట	ఉమ్మడి అనంతపురం జిల్లా
12.చైతన్య	982(బైపీసీ)	సిల్వర్ ర్యాంకర్	కురుగుంట	ఉమ్మడి అనంతపురం జిల్లా
13.రాణి	969	సిల్వర్ ర్యాంకర్	తనకల్లు	ఉమ్మడి అనంతపురం జిల్లా
ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో...				
14. వెంకటేష్ నాయక్	564		నల్లమాడ పాఠశాల	శ్రీసత్యసాయి
ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్				
15.సాకే సంతోష్	583		గొల్లలదొడ్డి	అనంతపురం
16.చామంతి	982(బైపీసీ)		తనకల్లు	శ్రీసత్యసాయి
17.మహేంద్ర నాయక్	555	సిల్వర్ ర్యాంకర్	కదిరి	ఉమ్మడి అనంతపురం జిల్లా
సోషల్ వేల్ఫేర్ హాస్టళ్లలో...				
18.అజిత్‌కుమార్	570మార్కులు	సిల్వర్ ర్యాంకర్	ఓడీచెరువు	ఉమ్మడి అనంతపురం జిల్లా
19.జనవి	945	సిల్వర్ ర్యాంకర్	హిందూపురం	ఉమ్మడి అనంతపురం జిల్లా

ఆపద వేళ.. రక్షణ ఇలా..!

జిల్లావ్యాప్తంగా మాక్‌డ్రిల్



సత్యసాయి ఎయిర్ పోర్టులో పోలీసుల మాక్‌డ్రిల్

పుట్టపర్తిరూరల్/హిందూపురం/చెన్నేకొత్తపల్లి/కనగానపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఉగ్రదాడులు, ఇతర ప్రమాద సమయాల్లో ఎలా రక్షణ పొందాలన్న అంశాలపై జిల్లావ్యాప్తంగా పోలీసులు బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. పుట్టపర్తిలోని సత్యసాయి విమానాశ్రయంలో పోలీసులు చేపట్టిన మాక్‌డ్రిల్‌ను కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న పర్యవేక్షించారు. ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినపుడు తక్షణం తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, సైరన్లు మోగినపుడు ఎలా స్పందించాలి, రక్షణకోసం ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయాలపై స్పెషల్‌పార్టీ పోలీసులు, బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్, ఫైర్, హెల్త్‌సిబ్బంది, చేపట్టే చర్యలను మాక్‌డ్రిల్‌లో వివరించారు. ప్రజలకు ఎలాంటి రక్షణ కల్పించాలి, ఆపద అనంతరం వారిని హాస్పిటల్‌కు ఎలా తరలించాలి, బాంబులు అమర్చిన ప్రాంతాలను డాగ్‌స్క్వాడ్ ద్వారా గుర్తించి వాటిని ఎలా డిస్పోజల్ చేయాలి అనే విషయాలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు.

హిందూపురంలో..



హిందూపురం కూరగాయల మార్కెట్‌వద్ద అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ, సీఐలు

పట్టణంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండు, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. బాంబులు వేస్తే ఆ శబ్దానికి ఎలా ఉండాలనే దానిపై ప్రజలకు వివరించారు. డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, అంజనేయులు, అబ్దుల్‌కరీం పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లిలో రామగిరి సీఐ శ్రీధర్, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ చేపట్టారు.

ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత ఆర్మీ.. ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడంపై కనగానపల్లిలో అధికారులు.. ప్రజలతో కలిసి మానవహారంగా ఏర్పడి సైన్యానికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, సీఎస్‌డీటీ కవిత, ఆర్ఐ సరళ పాల్గొన్నారు.

భారత్ దెబ్బ ఎలా ఉంటుందో చూపించారు

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ దెబ్బ ఎలా ఉంటుందో పాకిస్థాన్‌కు చూపించారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో గర్వంగా ఉందన్నారు. పాక్ ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం చేసిన ఈ ఆపరేషన్ దేశ ప్రజల గుండెల్లో ధైర్యాన్ని నింపిందన్నారు. నిత్యం ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ ఎంతో మందిని భారత్ మీదకు ఉసిగొల్పి పాకిస్థాన్ నరమేధాన్ని సృష్టిస్తోందన్నారు. అందుకే ప్రధాని మోదీ ఈ కఠిన నిర్ణయాన్ని తీసుకోవడాన్ని దేశ ప్రజలంతా స్వాగతిస్తున్నారన్నారు.

బీజేపీ సంబరాలు



స్వీట్లు పంచుకుంటున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, మే 7(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ అపరేషన్ సిందూర్ చేపట్టడం హర్షణీయమని బీజేపీ నాయకులు అన్నారు. నగరంలోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ అధ్యక్షతన బుధవారం సంబరాలు నిర్వహించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గుడిసె దేవానంద్, బీజేపీ సీనియర్ నాయకులు సందిరెడ్డి శ్రీనివాసులు, రత్నమయ్య, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో భారత సైన్యం ఉగ్రవాదాన్ని అంతమొదించి, ప్రజలకు అండగా నిలుస్తుందని అన్నారు.

భారత ఆర్మీకి సెల్యూట్: రఘువీరా



రఘువీరా ఆధ్వర్యంలో ర్యాలీ

మడకశిర రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ తీవ్రవాద శిబిరాలపై విజయవంతంగా దాడులు నిర్వహించిన భారత ఆర్మీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీరారెడ్డి సెల్యూట్ చేశారు. భారత ఆర్మీకి మద్దతుగా తన స్వగ్రామం నీకంఠాపురంలో బుధవారం గ్రామస్థులతో కలిసి మూడు రంగుల జెండా పట్టుకొని జై జవాన్, జై కిసాన్ అని నినదిస్తూ ర్యాలీ నిర్వహించి, సైనికులకు మద్దతు తెలిపారు. అనంతరం నీలకంఠేశ్వరుడి ఆలయ యాగశాలలో శత్రునాశన హోమం నిర్వహించారు

న్యూస్ బాక్స్

తాగునీటి సమస్య పరిష్కారం

గాండ్లపెంట, మే 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీకాలనీలో తాగునీటి సమస్య ఉందని ఆ కాలనీ వాసులు ఇటీవల ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి జలజీవన్ మిషన్ కింద జడ్పీ నిధులతో కాలనీలో బోరు వేయించగా.. నీరు పుష్కలంగా పడ్డాయి. దాన్ని బుధవారం ప్రారంభించడంతో ఆ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారమైంది.

పేర్లు నమోదు చేసుకోండి

ధర్మవరం, మే 7(ఆంధ్రజ్యోతి): ధర్మవరం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పదో తరగతి, ఇంటర్‌లో మంచి ఉత్తీర్ణత సాధించిన కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు ధర్మవరం కురుబ సంఘం, యువజన, ఉద్యోగుల సంఘం నాయకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదిలో 500 మార్కులకు పైన, ఇంటర్‌లో 900 మార్కులకు పైన సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఈనెల 20లోగా 9908387330, 9440808732 నెంబర్లకు ఫోన్‌చేసి పేర్ల నమోదు చేసుకోవాలన్నారు.

రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసిన డీఆర్ఎం



రైల్వేస్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం

ధర్మవరం, మే 7(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌నుగుంతకల్లు రైల్వే డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా, సీనియర్ డివిజనల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ బుధవారం తనిఖీ చేపట్టారు. రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న రెండో విడత పనులను గురించి రైల్వే ఎస్ఎం చల్లా నరసింహనాయుడును అడిగితెలుసుకున్నారు. అనంతరం గుంతకల్లుకు వెళ్లారు.

ఆర్డీటీ విదేశీ విరాళాల సేకరణకు అనుమతివ్వాలి

కదిరిఅర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సంస్థకు విదేశీ విరాళాల సేకరణకు అనుమతి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓ కార్యాలయం ఏఓ గురుప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య, ఆదెప్ప, శ్రీనివాసులు, తిప్పన్న పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు



కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

కదిరిఅర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు మున్సిపల్ కార్మికులు కమిషనర్ కిరణ్‌కుమార్‌కు బుధవారం నోటీసు అందించారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని.. తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మీనారాయణ, తిరుపాల్, జనార్ధన్, బాలక్రిష్ణ, చెన్నక్రిష్ణ, గంగప్ప, సీఐటీయు జగన్మోహన్, రామోహన్,ముస్తాక్, అలీ పాల్గొన్నారు.

లోతు దుక్కులతో మేలైన దిగుబడులు

నంబులపూలకుంట, మే 7(ఆంధ్రజ్యోతి): తొలకరి వర్షాలు కురిసిన వెంటనే లోతు దుక్కిలు దున్ని సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. లోతు దుక్కులు దున్నడం వల్ల మొండిజాతి కలుపు మొక్కలైన తుంగ, గరిక, దుంపలు ఎండకు నశిస్తాయన్నారు. తెగుళ్లు, చీడపీడల బాధ తొలుగుతుందన్నారు.

భూమి ఇచ్చి ఆదుకుంటాం

గాండ్లపెంట, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లి గ్రామానికి చెందిన రైతులు గంగన్న, రమణకు అసైన్‌మెంట్ కమిటీలో భూమి ఇస్తామని తహసీల్దార్ బాబురావు అన్నారు. ఈ రైతులకు గతంలో ప్రభుత్వం కొట్లపల్లి గ్రామంలో సాగు పట్టా ఇచ్చింది. అయితే వారు ఆ భూమిని సాగు చేసుకోలేదు. దీంతో ఆ భూమిలో ఉపాధి పథకం కింద నీటి కుంటలు తవ్వారు. ఇటీవల ఆ భూమిలోని నీటి కుంటలను పూడ్చడానికి గంగన్న, రమణయత్నించగా .. స్థానిక రైతులు అడ్డుకున్నారు. ఆ స్థలాన్ని పరిశీలించిన ఆర్డీఓ వీవీఎస్ శర్మ ఆ భూమిలోని నీటి కుంటలను పూడ్చటానికి వీలు కాదని, మరో చోట భూములు ఇస్తామని వారికి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆ రైతులు తహసీల్దార్ బాబురావును సంప్రదించగా.. మండలంలోని అసైన్‌మెంట్ కమిటీలో భూమి ఇస్తామని పేర్కొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన

ముదిగుబ్బ, మే 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కార్యాలయ ఇన్‌చార్జ్ హరీష్ బాబు బుధవారం పరిశీలించారు. ఆస్పత్రిలో తాగునీటి సమస్య ఉందని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నాలుగు రోజులలో బోరు పనులు పూర్తి చేసి, తాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తామని హరీష్ బాబు హామీ ఇచ్చారు.

ఎస్సీ సెల్ అధ్యక్షుడి నియామకం

ధర్మవరంరూరల్, మే7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నారాయణస్వామిని ఆ పార్టీ బుధవారం నియమించింది. ఆయన మండలంలోని గరుడంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. ఈ సందర్భంగా ఆయన్ను వైసీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

క్రికెట్, వాలీబాల్ కిట్ల పంపిణీ

ఓబుళదేవరచెరువు, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన వాల్మీకి సంఘం మహిళ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి నాగవేణి బుధవారం యువతకు రూ. ఏడు వేల విలువైన క్రికెట్, వాలీబాల్ కిట్లు అందించారు. ఈ కిట్లను యువత అశోక్, షబ్బరీ, మహేష్, విష్ణుమోహన్, గిరి, కిరణ్‌కు అందించారు.

పీఎం సూర్యఘర్ పథకంపై సమావేశం

ధర్మవరం,మే 7(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకంపై ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మహేశ్ బుధవారం సమావేశం నిర్వహించారు. పథకంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి.. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ట్రాన్స్‌కో డీఈలు, బ్యాంక్ మేనేజర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ







ధర్మవరం, ముదిగుబ్బ, తనకల్లులో కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న ఆర్యవైశ్య మహిళలు

ఘనంగా వాసవీమాత జయంతి

పలు ప్రాంతాల్లో కలశాలతో ఊరేగింపు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్ : ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీ మాత జయంతిని పలు ప్రాంతాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ధర్మవరంలో పాండురంగస్వామి ఆలయం నుంచి ఆర్యవైశ్య మహిళలు కలశాలతో కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య కొత్తసత్రంలో ఉయ్యాలోత్సవం నిర్వహించారు. అలాగే ముదిగుబ్బలో హరిహర గణేశ దేవాలయం నుంచి కన్యకాపరమేశ్వరి దేవాలయం వరకు, తనకల్లులో అంబేద్కర్ సర్కిల్ నుంచి అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపులు నిర్వహించారు. తాడిమర్రిలో వాసవీమాత ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. నల్లచెరువులో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. బుక్కపట్నం కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని బెంగుళూరు నుంచి తెప్పించిన పువ్వులతో అలంకరించారు.



తాడిమర్రిలో గ్రామోత్సవం



బుక్కపట్నంలో అలంకరణలో వాసవీమాత

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలి: కేతిరెడ్డి

బత్తలపల్లి మే 7(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ విదేశీ నిధులు పొందడానికి వీలుగా ఎఫ్‌సీఆర్‌ఏను కేంద్ర ప్రభుత్వం రెన్యువల్ చేయాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన తన అనుచరులతో కలసి స్థానిక ఫాదర్ ఘాట్ నుంచి ఆస్పత్రి వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేతిరెడ్డీ.. ఇన్నాళ్లకు గుర్తుకొచ్చిందా..?: బీజేపీ

ధర్మవరం: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్‌ను కేంద్ర ప్రభుత్వం కేతిరెడ్డి పదవీ కాలం ఒకటిన్నర సంవత్సరం ఉండగానే రద్దు చేసిందని, నాడు ఆ విషయం తెలిసినా ఎందుకు స్పందించలేదని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు ప్రశ్నించారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నాడు నిర్లక్ష్యం చేసి.. నేడు ర్యాలీ నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

టీడీపీ సభ్యత్వంతో భరోసా

ధర్మవరం రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారంపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మారుతి ఈ ఏడాది జనవరి 11న రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతను టీడీపీ కార్యకర్తగా సభ్యత్వ నమోదు చేయించుకొని ఉండటంతో ఇన్సురెన్స్ ద్వారా రూ. ఐదు లక్షలు బాధిత కుటుంబానికి జమ అయింది. దీంతో బుధవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ మండల నాయకులతో కలి సి ఆ గ్రామానికి వెళ్లి మారుతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి, మండలకన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న ఉన్నారు.

● సమస్యలు పరిష్కరించండి

ముదిగుబ్బ : మండలంలోని కొండగట్టుపల్లి పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌ను కోరినట్లు మండల నాయకులు చినగాని నరసింహ యాదవ్ తెలిపారు. బుధవారం రామగిరి మండలం వెంకటాపురంలో పరిటాల శ్రీరామ్‌ను కలిశానని, తాగునీరు, సీసీ రోడ్లు, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, మద్దిలేరు బ్రిడ్జ్, గ్రీన్ ఫీల్డ్ హైవే రైతుల పరిహారం తదితర సమస్యలపై దృష్టి సారించాలని కోరినట్లు చెప్పారు.



మారుతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పరిటాల శ్రీరామ్

క్రైం న్యూస్..

యువకుడి ఆత్మహత్య

ధర్మవరం రూరల్, మే7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంపర్తి కాలనీకి చెందిన వలిపి రవి(18) మంగళవారం అర్ధరాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాలనీలో నివాసం ఉంటున్న పెద్దన్న, రమణమ్మ దంపతుల కుమారుడు రవి. ఇతడు రాళ్లు కొట్టే పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆ యువకుడికి పల్సర్‌బైకు తీసిచ్చారు. దానిపై అతివేగంతో వెళ్తుండటంతో గమనించిన చుట్టుపక్కల వారు ఆ యువకుడి తల్లికి విషయం చేరవేశారు. తల్లిదండ్రులు మందలించి ఆ బైకును వేరే చోట పెట్టారు. దీంతో మనస్తాపం చెందిన యువకుడు మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో పైకప్పునకు ఉరి వేసుకున్నాడు. తెల్లవారుజామున కుటుంబసభ్యులు ఇంట్లోకి వెళ్లగా ఉరికి వేలాడుతున్న రవి కనిపించాడు. వెంటనే అతడిని కిందకు దింపి పరిశీలించగా, మృతి చెందినట్లు తెలిపారు. రూరల్ పోలీసులు బుధవారం సంఘటన స్థలానికి వెళ్లి, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



రవి మృతదేహం

చెత్త తొలగించండి

సంత పక్కనే వ్యర్థాలను పడేస్తున్న వైనం

దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు

తనకల్లు, మే 7(ఆంధ్రజ్యోతి): స్థానికంగా వారపు సంతను ప్రతి శనివారం నిర్వహిస్తారు. వ్యాపారులు కుళ్లిన ఆకుకూరలు, కూరగాయలు, ఇతర వ్యర్థాలను సంత ప్రాంతం పక్కనే పారేస్తున్నారు. అంతేకాకుండా చికెన్ వ్యాపారులు వ్యర్థ పదార్థాలను ఇక్కడికి తీసుకొచ్చి పారేస్తున్నారు. వారాలు గడుస్తున్నా.. వాటిని పంచాయతీ సిబ్బంది తొలగించకపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. దీంతో ఈ ప్రాంతంలో నివాసముంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు ఈ సంతకు వేలం నిర్వహించి నిధులను జమ చేసుకుంటున్నారే తప్ప.. ఆ ప్రాంతాన్ని ఏమాత్రం శుభ్రం చేయించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యను పలుమార్లు పంచాయతీ అధికారులు, సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు.

సంత ప్రాంతం పక్కన నిల్వ ఉన్న చెత్త



అధికారులు స్పందించాలి



ఈ దుర్వాసన సమస్యపై పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్ స్పందించాలి. సంతలో కూరగాయాల కోసం ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. సంతను వేలం వేసి డబ్బులు తీసుకున్న అధికారులు.. దాన్ని పరిశుభ్రం చేయించాలని ఆలోచించకపోవడం అన్యాయం. అధికారులు స్పందించాలన్నారు.

-రామాంజులు, వ్యాపారి, తనకల్లు

దుర్వాసన భరించలేం



ప్రతిరోజు మా గ్రామం నుంచి తనకల్లుకు వెళ్తుంటాను. ఈ సంత మీదుగానే వెళ్లాలి. సంత ప్రాంతానికి వెళ్లగానే భరించలేని దుర్వాసన వస్తోంది. ఈ ప్రాంతంలో నివాసముండే వారి పరిస్థితి మరీ ఘోరం. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

-ఆదినారాయణ, పరాకువార్లపల్లి

శుభ్రం చేయిస్తాం

సంత సమీపంలో చెత్తచెదారం, కోళ్ల వ్యర్థాలు వేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. రెండు రోజుల్లో శుభ్రం చేయించి, సమస్య పరిష్కరిస్తాం.

-కృష్ణమూర్తిరెడ్డి, కార్యదర్శి

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

కొత్తచెరువు, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల ఉపాధ్యాయుడు రమణ కుమారుడు విజయకాంత్ కొత్తచెరువు నుంచి బుక్కపట్నంకు కారు లో బుధవారం బయలుదేరాడు. కారు మోరీ వద్దకు రాగానే అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తం భాన్ని బలంగా ఢీకొంది. దీంతో ఆ స్తంభం విరిగిపోయింది. వైర్లు ట్రిప్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమా దం తప్పింది. ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పింది. గాయపడిన విజయకాంత్‌ను పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీకి తరలించారు.



స్తంభాన్ని ఢీకొన్న కారు

ఆర్య వైశ్య సంఘం మండల కమిటీ ఎన్నిక

ముదిగుబ్బ, మే 7(ఆంధ్రజ్యోతి): ఆర్య వైశ్య మండల కమిటీని స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సూర్యనారాయణ, అధ్యక్షుడిగా అంబటి హరినాథ్ గుప్తా, ఉపాధ్యక్షుడిగా జనార్ధన్ గుప్తా, యువజన సంఘం అధ్యక్షుడిగా కృష్ణం మహేష్ కుమార్, మహిళా మండలి అధ్యక్షురాలిగా భాగ్యరేఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వెంకటరాజు గుప్తా, వెంకటరత్నం, శ్రీధర్, సుబ్రమణ్యం, నాగరాజు పాల్గొన్నారు.



నూతన సభ్యులను సన్మానిస్తున్న ప్రముఖులు

నాటుసారా తయారీదారుల అరెస్టు

కదిరి అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరవతండా, బాలప్పగారిపల్లి తండాల్లో బుధవారం దాడులు నిర్వహించిన.. నాటుసారా తయారు చేస్తున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి.. కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు.

ఐదుగురు జూదరులు..

తనకల్లు, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిమానుపల్లి గ్రామ సమీపంలో బుధవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,700 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కదిరి(నల్లచెరువు) మే 7(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు మండలం గోరంట్లవారిపల్లిలో ఓ వ్యక్తి ఇంట్లో నిల్వ ఉంచిన కర్ణాటక మద్యం 90 ఎంఎల్ 288 టెట్రా ప్యాకెట్లను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐలు జిలాని, ఎంఎల్ తిప్పయ్యస్వామి తెలిపారు. అతన్ని అరెస్ట్ చేసి.. కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుళ్లు రమేష్‌రెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు వెంకటేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న విద్యార్థి

ఓబుళదేవరచెరువు, మే7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో 570 మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థి అజిత్‌కుమార్‌కు బుధవారం రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి బెస్టు స్కోర్ అవార్డును అందజేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ అవార్డు అందుకున్నాడు. భవిష్యత్‌లో మరింత బాగా చదవాలని మంత్రి ఆ విద్యార్థికి సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులున్నారు.



అజిత్‌కుమార్‌కు అవార్డు అందజేస్తున్న మంత్రి

ఆధార్ క్యాంప్ ఏర్పాటు

కదిరి (అమడగూరు), మే 7(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్ సచివాలయంలో ఆధార్ క్యాంప్ బుధవారం ఏర్పాటు చేశారు. ఆధార్‌లో వ్యక్తుల చేర్పులు, తొలగింపులు, పుట్టిన తేదీ, నూతన ఆధార్ కార్డులు, చిరునామా మార్పులు.. తదితర వాటిని చేసుకోవచ్చని అమడగూరు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ అశోక్ తెలిపారు. ప్రతి సోమ, మంగళవారాల్లో ఈ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మహమ్మదాబాద్ డిజిటల్ అసిస్టెంట్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి జానకి పాల్గొన్నారు.





ధర్మవరం, కదిరి రైల్వేస్టేషన్లలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

అప్రమత్తతపై మాక్ డ్రిల్



బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు



తాడిమర్రిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: పాక్‌పై ప్రతీకార చర్యగా భారత్ సిందూర్ పేరుతో బుధవారం తెల్లవారుజామున చేపట్టిన దాడులు విజయవంతం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఉగ్రదాడులు జరిగితే ఎలా అప్రమత్తం కావాలనేదానిపై కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఫైర్ సిబ్బంది, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, జీఆర్‌పీఎఫ్, పోలీసులు ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ధర్మవరం రైల్వే స్టేషన్, కదిరి రైల్వేస్టేషన్, ముదిగుబ్బ రైల్వే స్టేషన్, తాడిమర్రి సబ్‌స్టేషన్, బస్టాండ్ కూడలిలో, ఓబుళదేవరచెరువులోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఈ మాక్ డ్రిల్ చేపట్టారు. దాడుల్లో గాయపడ్డ వారికి ఎలా ప్రథమ చికిత్స చేయాలనే దానిపై బత్తలపల్లిలో ఆర్డీటీ ఆస్పత్రిలో అవగాహన కల్పించారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న పోలీసు

శక్తి యాప్‌పై విస్తృత అవగాహన

పుట్టపర్తి రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన శక్తియాప్‌పై శక్తి, పోలీసు బృందాలు బుధవారం జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాయి. వారి సెల్‌ఫోన్లలో ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి.. దాన్ని ఎలా ఉపయోగించాలో వివరించాయి.

హంస వాహనంపై సంగమేశ్వరుడు

కొత్తచెరువు, మే 7(ఆంధ్రజ్యోతి): సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి హంసవాహనంపై పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మనోహర్, నటరాజ్, పణి, నాగరాజ్, అర్చకులు సాయినాథ్ శర్మ పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

ముగిసిన గుట్టె లక్ష్మీదేవి జలధి ఉత్సవం


అలంకరణలో అమ్మవారు

రొళ్ల, మే 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిల్లిగుండ్లు గ్రామంలో వెలసిన గుట్టె లక్ష్మీ దేవి ఉత్సవాలు ముగిశాయి. 12ఏళ్ల తరువాత నిర్వహించిన ఉత్సవాలను అమ్మవారి జాతర మహోత్సవ సమితి, పిల్లిగుండ్లు ఆర్‌కె ఫౌండేషన్‌ఫర్ సోషియల్ వెల్ఫేర్ అధినేత రామక్రిష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న పీఠాధిపతులకు, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, నాయకులు, కార్యకర్తలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠకు ఎంపీ భూమిపూజ


పూజల్లో పాల్గొన్న ఎంపీ దంపతులు

హిందూపురం, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నంజుండేశ్వర స్వామి ఆలయం ఆవరణంలో నిర్మించతలపెట్టిన కాలభైరవ స్వామి విగ్రహప్రతిష్ఠ భూమిపూజ కార్యక్రమంలో ఆనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ దంపతులు పాల్గొన్నారు. బుధవారం కాలభైరవ స్వామివిగ్రహప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించండి



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం, మే 7(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బుధవారం ఆ సంఘం నాయకులు, మున్సిపల్ కార్మికులు చైర్మన్ రమేష్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ 220 మంది వర్కర్ల ఈఎస్ఐ, ఈపీఎఫ్ సొమ్ము అడ్డాదారుల్లో తీసుకున్నారన్నారు. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పదవీ విరమణచేసిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, చనిపోయిన వారి కుటుంబాల్లో కూడా ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నాయకులు బాబు, చలపతి, కమల్‌పాషా పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వం


మోటారు ఏర్పాటుకు పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తోందని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. బుధవారం పట్టణంలో పలుచోట్ల బోరుబావులు, కొత్తమోటార్లు ఏర్పాటు చేశారు. చైర్మన్ వాటి మరమ్మతు పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటిసమస్యతో ప్రజలు ఇబ్బందులు పడకూడదని బోరుబావులకు కొత్తమోటార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కరువు నిధుల ద్వారా వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గొల్లపల్లి నుంచి వచ్చే నీటితోపాటు అదనంగా బోరుబావుల నుంచి నీటిని అందిస్తామన్నారు. కౌన్సిలర్ అయూబ్, మున్సిపల్ అధికారులు ఆనంద్‌రాజు, జనార్దన్, నాయకులు డైమండ్ బాబా, ఆదినారాయణ, గోపాల్, ఇందిరమ్మ పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపల్లిలో ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు మండల కన్వీనర్ సిద్దయ్య తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉండటంతో మంత్రి సవిత చొరవతో వారం క్రితం తాగునీటి బోరును వేయగా పుష్కలంగా నీరు పడింది. ప్రజల దాహార్తిని తీర్చేందుకు జలజీవన్‌మిషన్ కింద రూ.35లక్షల వ్యయంతో 60వేల లీటర్ల నీటి ట్యాంకు నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. పట్టా చిన్నవెంకటరాముడు, పట్టా రామప్ప, నాగేనాయక్, చలపతి, నాగేంద్ర, శెక్షావలి, రామాంజనేయులు, ఆదినారాయణ, నరసింహులు పాల్గొన్నారు.

సీఈసీ కోర్సు ప్రారంభించాలి

చిలమత్తూరు, మే 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డీవీఆండ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అనుగుణంగా ఈ ఏడాది నుంచి సీఈసీ కోర్సుని ప్రారంభించాలని పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సభ్యుడు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సీఈసీ కోర్సు స్థానిక జూనియర్ కళాశాలలో లేకపోవడంతో విద్యార్థులు హిందూపురం వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం ఇక్కడే కోర్సుని ప్రారంభిస్తే విద్యార్థులకు అనుకూలంగా ఉంటుందన్నారు. అధికారులు స్పందించి ఈ విద్యాసంవత్సరం నుంచే కోర్సుని ప్రారంభించాలని కోరారు.

ఇంట్లో చోరీ

● పది తులాల బంగారం, రూ.50వేలు అపహరణ

పరిగి, మే 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఊటకూరు రోడ్డులోగల ఇందిరమ్మ కాలనీలో రామక్రిష్ణ అనే రైతు ఇంటిలో మంగళవారం రాత్రి దొంగలుపడ్డారు. ఇంటి యజమాని తెలిపిన మేరకు.. తన అన్న కుమార్తె పెళ్లికావడంతో ఆ పనులపై ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పెళ్లి ఇంటి వద్దకు కుటుంబంతో వెళ్లారు. ఈ విషయాన్ని పసిగట్టిన దుండగులు ఇంట్లో జొరబడి బీరువాలో పెళ్లికోసం దాచుకున్న పది తులాల బంగారం, రూ.50వేలు నగదును దోచుకెళ్లారు. ఉదయం ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి చూడగా దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకున్నారు. పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. సమీపంలోని సీసీ కెమెరాలో దొంగలు పరుగెడుతున్న విషయం గమనించారని, త్వరలో వారిని పట్టుకుంటామని ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కలవరపెడుతున్న అతిసార..!

● ఎనిమిది నెలల క్రితం రెండు గ్రామాల్లో మహమ్మారి
● జీజీ హట్టిలో మరో 11 మంది ఆస్పత్రిలో చేరిక
● ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు


రొళ్ల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మడకశిర టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రజలను అతిసార వ్యాధి కలవరపెడుతోంది. నియోజకవర్గంలోని జి.జి.హట్టి గ్రామంలో మంగళవారం చిన్నారి అమూల్య మృతిచెందిన విషయం తెలిసిందే. గ్రామంలో రెండు మూడు రోజుల క్రితం నాలుగు పెళ్లిళ్లు, గ్రామదేవత ఉత్సవం నిర్వహించారు. దీంతో పాటు కలుషిత నీరు తాగడం వల్ల 24మంది వాంతులు, విరేచనాలతో ఆసుపత్రి పాలయ్యారు. గత ఏడాది ఆగస్టులో కొంకల్లు, ఎం.రాయాపురం తదితర గ్రామాల్లో నీటి సమస్య వల్ల అతిసార వ్యాధి ప్రబలింది. అప్పట్లో ఆరుగురు మృతి చెందారు. అప్పట్లో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధికారులకు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పలు ఆదేశాలు జారీ చేశారు. ఆ ఘటన మరవకముందే మంగళవారం రొళ్ల మండలంలోని జి.జి.హట్టి గ్రామంలో అతిసార ప్రబలి 24మంది ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్సపొందతుఊ చిన్నారి మృతిచెందింది. విషయం తెలుకుతున్న వైద్య శాఖ, పంచాయతీ అధికారులు గ్రామానికి చేరుకొని బాధితులకు వైద్యసేవలు, పారిశుధ్య పనులు చేపడుతున్నారు.


రత్నగిరి గ్రామంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

తాగునీటి సమస్యతోనే ప్రబలుతున్న వ్యాధి

కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య వల్ల బోరుల వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకొంటున్నారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా మడకశిర నియోజకవర్గంలోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ పాలనలో జలజీవన్ మిషన్ నుంచి వచ్చిన నిధులు సక్రమంగా వినియోగించక పోవడం, గ్రామాల్లో పగిలిన పైప్‌లైన్లను మరమ్మతులు చేయకపోవడంతోనే సమస్య తీవ్రంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మరో 11 మంది ఆసుపత్రిలో చేరిక..

రొళ్ళ మండలంలో బుధవారం కూడా అతిసార అగలేదు. వైద్యధికారులు క్యాంపు నిర్వహించగా మరో 11మంది అతిసారకు గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. రొళ్ల ప్రభుత్వ ఆస్పత్రితో పాటు కర్ణాటక రాష్ట్రం కొరటగెరకు వెళ్లి చికిత్స పొందినట్లు తెలిపారు. ప్రస్తుతం వైద్యాధికారులు క్యాంపు నిర్వహిస్తున్న సాయంత్రం వరకు అతిసార అదుపులోకి రాలేదని, సాయంత్రం నుంచి కొంత తగ్గుముఖం పట్టినట్లు గ్రామస్థులు తెలిపారు.

బాలిక కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

మండలంలోని జీజీ హట్టి గ్రామానికి చెందిన అమూల్య అతిసార వ్యాధితో మంగళవారం మృతిచెందిన విషయం తెలిసిందే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గ్రామాన్ని సందర్శించి బాలిక కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం గ్రామంలో సమావేశం ఏర్పాటుచేసి అతిసార వ్యాధిని నివారించడానికి ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి, తహసీల్దార్ షెక్షావలి, ఎంపీడీఓ రామారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మారనున్న మడకశిర రూపురేఖలు: ఎమ్మెల్యే

మడకశిర రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల రాకతో మడకశిర రూపురేఖలు మారుతాయని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. మండలంలోని ఆర్ అనంతపురం వద్ద బుధవారం ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా మడకశిర, గుండుమల మండలాల్లో సోలార్ పార్కు ఏర్పాటుకు రూ.15 వేల కోట్లు బడ్జెట్‌ను కేటాయించారన్నారు. సోలార్ పార్కు ఏర్పాటుకు భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు రూ.31 వేలు ఇస్తున్నాట్లు తెలిపారు. అలాగే ప్రతి రైతు కుంటుంబంలో ఒకరికి ఉద్యోవ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆర్ అనంతపురం వద్ద ఫ్యాక్టరీల నిర్మాణానికి 1600 ఎకరాల భూములు సేకరించినట్లు తెలిపారు. త్వరలో డిఫెన్స్ ఫ్యాక్టరీ, కేంద్రవిశ్వ విద్యాలయం రానున్నట్లు తెలిపారు. మడకశిర ప్రాంతం నుంచి 40 వేల మంది కూలీలు వలసలు వెళ్లారన్నారు. స్థానికంగా ప్యాక్టరీలు వస్తే వలసలు వెళ్లిన వారి తిరిగి వస్తారన్నారు. ఫ్యాక్టరీలు వస్తే వెనుకబడిన ఈ ప్రాంతంలోని ప్రజల జీవన విధానంలో భారీ మార్పులు వస్తాయన్నారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే ప్రతి పనికి ఒక రేటు కట్టి ప్రజలను, రైతులను దోచుకున్నారని విమర్శించారు. గుండుల తిప్పేస్వామి మాట్లడుతూ పారిశ్రామిక హబ్‌గా మడకశిర మారనుందన్నారు. ఏపీఐఐసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ స్వానసోని, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, క్లస్టర్ ఇన్‌చార్జిలు నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.


సీఎం ఆవిష్కరించిన శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

మడకశిర టౌన్: నియోజకవర్గంలో సమస్యలతో ఏ ఒక్కరు ఇబ్బందులు పడకూడదనే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎం.ఎస్, రాజు అన్నారు, బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలసి ప్రజాదర్బార్‌లో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అక్కడికక్కడే పరిష్కారయ్యే సమస్యలు వెంటనే పరిష్కారించేలా అధికారులకు సూచనలు చేశారు. 30 మంది వరకు వచ్చి వారి వారి సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసకెళ్లారు. వారి సమస్యలు పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు, ప్రతి బుధవారం నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు,

కరెంటు బిల్లు రూ.26 లక్షలు..!

● అవాక్కయిన యజమాని
● ప్రింటింగ్ మిస్టేక్ అంటున్న అధికారులు


బాడితుడికి వచ్చిన కరెంటు బిల్లు

సోమందేపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాతూరులో నివాసముంటున్న చేనేత కార్మికుడు రాజుకు ఏప్రిల్ నెలకు సంబంధించిన కరెంటు బిల్లు ఏకంగా రూ.26,34,258 రావడంతో అవాక్కయ్యాడు. నెత్తిన పిడుగు పడ్డ చందంగా నోరువెళ్లబెట్టాడు. బిల్లింగ్ వేసిన ఉద్యోగి ఆలిని ప్రశ్నించగా కాసేపు గందరగోళం నెలకొంది. ఖంగుతిన్న ఉద్యోగి, అధికారులకు సమాచారం అందించారు. తన ఇల్లు అమ్మినా ఇంత బిల్లు కట్టలేనని బాధితుడు వాపోయాడు. అప్రమత్తమైన అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఎందుకిలా జరిగింది ఏంటి కథఅని విద్యుత్‌శాఖ ఏఈ పరమేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా స్కానింగ్ సమయంలో రీడింగ్ మిషన్ తప్పిదంవల్ల కొన్ని సందర్భాల్లో అలా జరుగుతుందని, ప్రింటింగ్ మిస్టేక్ అని లైట్ తీసుకోమన్నారు.

యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా కళ్యాణ్‌చక్రవర్తి

అమరాపురం, మే 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు నూతన మేనేజర్‌గా కళ్యాణ్‌చక్రవర్తి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న మేనేజర్ గుంతకల్లుకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన కళ్యాణ్ చక్రవర్తి ఇక్కడకు వచ్చారు. అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న కృష్ణకాంత్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో కర్ణాటక రాష్ట్రం కొరటగెరకు చెందిన జగదీశ్ గుప్త బాధ్యతలు చేపట్టారు.

ఉపాధి పనులపై సమీక్ష


సోమందేపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులపై బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీఓ నరేంద్రకుమార్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలో కూలీలను లక్ష్యంగా పెట్టుకుని వ్యవసాయ అనుబంధ పనులను మాత్రమే చేయించాలన్నారు. ఏపీఓ సోమశేఖర్ రెడ్డి, టీఎలు, ఈసీలు తదితరులుపాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న న్యాయాధికారి వెంకటేశులు నాయక్

హిందూపురం, మే 7(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి కార్మికుడికి అవగాహన అవసరమని సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశులునాయక్ అన్నారు. బుధవారం ఆటోనగర్‌లో కార్మిక వారోత్సవాల్లో భాగంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన న్యాయాధికారి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న చట్టాలపై తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలు అమలు చేస్తున్నారన్నారు. దేశంలో 3వేలకు పైగా చట్టాలుండగా వాటిపై అందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. న్యాయవాదులు మురళి, మనోహర్, గురునాథ్, దివ్య, అంజినమ్మ, లోక్‌అదాలత్ సిబ్బంది శారద, ఆటోనగర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీని శుభ్రం చేయించండి


పిచ్చిమొక్కలతో పేరుకుపోయిన డ్రైనేజీ

గుడిబండ, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రాయాపురం గ్రామంలోని డ్రైనేజీలు శుభ్రం చేయాలని గ్రామస్థులు కోరారు. డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకుపోవడంతోపాటు పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి మురుగు ముందుకు కదలడం లేదని ప్రజలు వాపోతున్నారు. దుర్వాసన వెదజల్లుతోందని, ఈగలు, దోమలు వ్యాప్తిచెందే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే డ్రైనేజీ శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్‌లో మాక్‌డ్రిల్

పెనుకొండ, మే 7(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ నుంచి సైనిక దాడులు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా స్థానిక రైల్వే స్టేషన్‌లో బుధవారం మాక్‌డ్రిల్ ఏర్పాటు చేశారు. భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధవాతావరణం నెలకొందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు సైనికదాడి నుంచి ఎలా రక్షించుకోవాలో మాక్ డ్రిల్ ద్వారా వివరించారు. ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ నరసింగప్ప, తహసీల్దార్ శ్రీధర్, నగర పంచాయతీ కమిషనర్ సందీప్‌కుమార్, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, అగ్నిమాపక సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ నాయక్, రైల్వే సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, టీడీపీ నాయకులు శ్రీరాములు, సాయిప్రసాద్, బోయసోము, రాము, బాషా, బీజేపీ నాయకులు రామాంజనేయులు, రామక్రిష్ణ, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

లేపాక్షి: భారత్ పాకిస్తాన్ మధ్య నెలకొన్న గొడవల కారణంగా దేశవ్యాప్తంగా ప్రముఖ పట్టణాల్లో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో బుధవారం లేపాక్షిలో మాక్ డ్రిల్ ఏర్పాటు చేశారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ ఆధ్వర్యంలో ఎస్ఐ నరేంద్ర మాక్ డ్రిల్ ఏర్పాటు చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన లేపాక్షి ఆలయ ప్రధాన ద్వారం వద్ద మాక్ డ్రిల్ ఏర్పాటు చేశారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలు ప్రాణాలు ఎలా కాపాడుకోవాలి, సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలివెళ్లాలి, సైరన్ మోగగానే ప్రజలు ఎలా స్పందించాలి అనే దానిపై పోలీసులు అవగాహన కల్పించారు.

పరిగి: భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధవాతావరణం నెలకొనడంతో పాకిస్థాన్ దాడుల నుంచి ప్రజలు ఏవిధంగా తప్పించుకుని ప్రాణాలు రక్షించుకోవాలని బుధవారం పైడేటి సర్కిల్‌లో పోలీసులు మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, ఆర్ఐ సిద్దేశ్, ఎఎస్ఐ బాలరాజు, జమేదార్ సునీల్‌నాయక్, కానిస్టేబుళ్లు సురేష్, భగవాన్, రామాంజి, నాగార్జున పాల్గొన్నారు.



పెనుకొండ రైల్వేస్టేషన్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

భక్తిశ్రద్ధలతో వాసవీ జయంతి

వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని ఆర్యవైశ్యులు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారిని ప్రత్యేక రథంలో ఉంచి పురవీధుల గుండా ఊరేగించారు. మహిళలు ఉపవాస దీక్షలు చేసి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.

-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



మడకశిర, అగళిలో ప్రత్యేక అలంకరణలో వాసవీమాత


హిందూపురంలో ర్యాలీ చేస్తున్న ఆర్యవైశ్యులు


పెనుకొండలో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు


పావగడలో వాసవీమాతకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

పేదల గుడిసెలు తొలగింపు


పంచాయతీ స్థలంలో నిర్మాణాలు తొలగిస్తున్న దృశ్యం

సోమందేపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో ఉన్న సర్వే నం.700లో సీపీఐ ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెలను బుధవారం పంచాయతీ అధికారులు తొలగించారు. సీపీఐ నాయకుడు బాలస్వామి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో 180మంది పేదలు నల్లగొండ్రాయనపల్లివద్ద గుడిసెలు, షెడ్లు వేసుకుని జీవనం సాగిస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలీసుల సహాయంతో అధికారులు వాటిని తొలగించారన్నారన్నారు. దీనిపై హైకోర్టులో దావా వేశామన్నారు. ఇటీవల హైకోర్టు స్టేటస్కో ఇచ్చిందన్నారు. ఈ తరుణంలో అదే ప్రాంతంలో గుడిసెలు, షెడ్లు నిర్మించుకుంటుంటే పంచాయతీ అధికారులు వాటిని తొలగించి సామగ్రిని తరలించడం అన్యాయమన్నారు. ఈ విషయంలో సీపీఐ నాయకులకు, అధికారులకు మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. టీడీపీ నాయకులు వడ్డె సురేష్ జోక్యం చేసుకుని ఇరువురికి నచ్చజెప్పారు.

మన్యం వీరుడికి ఘన నివాళి


అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు బ్రిటీష్ పాలకులను గజగజలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని స్థానిక టీడీపీ నాయకులు, పురప్రముఖులు ఘనంగా నిర్వహించారు. ఉదయం మిట్ట ఆంజనేయస్వామి ఆలయం పక్కన ఉన్న అల్లూరి సీతరామరాజు విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. స్వాతంత్ర్య సమరంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు, రిటైర్డ్ టీచర్ షఫీవుల్లా, రమణమ్మ, మాజీ సర్పంచ్ అశ్వత్థప్ప, సూర్యనారాయణ, పాలడుగు చంద్ర, త్రివేంద్రనాయుడు, సాయిప్రసాద్, సుబ్రహ్మణ్యం, ఈశ్వర, కురుబ నంజుండ, నారాయణనాయక్, బోయసోము, మూర్తి, జయచంద్ర, సమీవుల్లా, రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

చిలమత్తూరు, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగీ ధాబా సమీపాన 44వ జాతీయ రహదారిపై బైక్‌ను వెనుకనుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో యువకుడు సింహాద్రి (21) మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొడికొండ ఎస్సీ కాలనీకి చెందిన సింహాద్రి బూదిలి సమీపంలోని కియ అనుబంధ పరిశ్రమలో పనిచేస్తుండేవాడు. విధులకు హాజరయ్యేందుకు బుధవారం ఉదయం తన ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. జంగీ ధాబా సమీపంలో వెనుకనుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, విచారణ చేపట్టారు. యువకుడి కుటుంబీకులకు సమాచారం ఇచ్చి, కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

అమరాపురం, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెంకెర గ్రావనికి చెందిన హనుమంతరాయప్ప(40) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతని స్వస్థలం రొళ్ల మండలం సోమగట్ట. రెండేళ్ల నుంచి భార్య జ్యోతి, పిల్లలతో ఇక్కడే నివసిస్తున్నాడు. రెండేళ్ల నుంచి టీబీ వ్యాధితో బాధపడుతూ, దీనికి తోడు మద్యానికి బానిసై జీవితంపై విరక్తిచెంది మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పంచెతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం జ్యోతి తల్లి చూసి బెంగళూరులో ఉన్న కుమార్తెకు చెప్పగా ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఇసాక్‌బాషా, ఏఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.